Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03






# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



## అదరగొట్టిన జగన్

### తొలిసభలోనే రాణింపు
### వై.యస్.ను తలపించిన మాటతీరు
### అధికార పక్షంపై విమర్శల దాడి

**ప్రధాని పదవి రావచ్చు, రాకపోవచ్చు... ముఖ్యమంత్రి కుర్చీ దక్కవచ్చు, దక్కకపోవచ్చు... కాని ప్రతిపక్ష నేత హోదా అరుదుగా వస్తుంది. అదృష్టం కొద్దీ వస్తుంది. కేంద్రంలో ప్రతిపక్ష నేత అవకాశం వచ్చినా తన దురదృష్టం కొద్దీ కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీ వదులుకున్నాడు. జగన్ మాత్రం ఆ పొరపాటు చేయలేదు. దేవుడు తనకు ఇచ్చిన అదృష్టంగా భావించాడు. ప్రతిపక్ష నేత బాధ్యతను హుందాగా స్వీకరించాడు.**

నిన్నటి ఎన్నికల్లో నూరుశాతం అధికారం తనదేనన్న గ్యారంటీతో వున్న జగన్ ఫలితాలతో నిరాశ చెందాల్సి వచ్చింది. వచ్చిన ఫలితాల నుండి తేరుకోవడానికి ఆయనకు ఓ వారం పట్టింది. అయినా కోలుకుని ప్రతిపక్ష నేత పాత్రలోకి వచ్చాడు. తొలి అసెంబ్లీ సమావేశాలలోనే అదరగొట్టాడు. అధికారపక్షాన్ని దీటుగా ఎదుర్కొన్నాడు. వివిధ సమస్యలపై చర్చను లేవనెత్తడంలోనూ, ప్రశ్నలు వేయడంలోనూ ఆయన తన తండ్రి వై.యస్.రాజశేఖరరెడ్డిని తలపించాడు. ముఖ్యంగా ఋణమాఫీపై చంద్రబాబును నిలువునా కడిగేసాడు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఋణమాఫీ వాగ్ధానం చేసేటప్పుడు ఆర్‌బిఐ, కేంద్ర ప్రభుత్వం వంటి సాకులు చెప్పలేదే అంటూ నిలదీసాడు. అసెంబ్లీలో తన ఓటమిని సైతం ఆయన హుందాగా స్వీకరించిన తీరు ప్రశంసలందుకుంది. అతివిశ్వాసం, ఋణమాఫీ, నరేంద్ర మోడీ ఆకర్షణతో పాటూ మరికొన్ని కారణాల వల్ల తాము ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చిందని ఆయన చెప్పుకొచ్చాడు. జగన్ ఆరోపణలపై అధికార తెలుగుదేశం పార్టీ స్పందించిన తీరు సక్రమంగా లేదు. ఆయన ప్రస్తుత సమస్యలపై నిలదీస్తే తెలుగుదేశం సభ్యులు

(మిగతా 10వ పేజీలో)

## స్పీడందుకోని సీఎం



### ఋణమాఫీ అడ్డంకి
### వేధిస్తున్న నిధుల కొరత
### సమస్యలు బోలెడు.. అవకాశాలు జానెడు

**దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ పరుగులు తీస్తున్నాడు. మంత్రులు, అధికారుల చేత పరుగులు పెట్టిస్తున్నాడు. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడ్డ తెలంగాణకు తొలిముఖ్యమంత్రి కేసీఆర్ కూడా పనితీరులో వేగం పెంచాడు. చకచకా నిర్ణయాలు తీసేసుకుంటున్నాడు. ఆల్‌రెడీ అభివృద్ధి చెందిన హైదరాబాద్‌ను మరింత ముందుకు తీసుకుపోయే దిశగా చర్యలు చేపడుతున్నారు. పక్కాగా తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తూ అవసరమైతే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కొట్లాటకు సిద్ధపడుతున్నారు.**

కాని వీరితో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడులోనే ఆ వేగం కనిపించడం లేదు. పరిపాలనపై ఆయన పూర్తి స్థాయిలో దృష్టి పెట్టినట్లు అనిపించడం లేదు. ఎన్నికల ఫలితాలు వచ్చింది మొదలు అన్ని విషయాల్లోనూ ఆలస్యమే చేస్తున్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంలోనూ, బాధ్యతలు స్వీకరించడంలోనూ... అన్నింటా ఆలస్యమే కనిపించింది. ఇక కొన్ని బాలారిష్టాలను అధిగమించలేక ఆయన సతమతమవుతున్నారు. వాటిలో ఋణమాఫీ ప్రధాన ప్రతిబంధకంగా మారింది. దీనిపై ఏదో ఒక నిర్ణయం తీసుకుంటేగాని ఆయన ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఋణమాఫీని పూర్తిగా అమలు చేయాలంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అందుకు అనుకూలించేలా లేదు. ఋణమాఫీ మీద ఏ మాత్రం వెనుకడుగేసినా ఆరంభంలోనే చంద్రబాబు మీద అదొక రిమార్క్‌లా మిగిలిపోతుంది. ఇక జనం నమ్మే పరిస్థితి ఉండదు. ఋణమాఫీకి కేంద్రం గాని, ఆర్‌బిఐ గాని సహకరించకపోతుండడంతో చంద్రబాబు అయోమయంలో ఉన్నారు. మరోపక్క బలమైన ప్రతిపక్షంగా వున్న వైకాపా


(మిగతా 10వ పేజీలో)



## అసంతృప్తితో వెంకయ్య

✷ ఫలితాల తీరుతో మనస్థాపం

వివరాలు 3లో








## రాష్ట్రాల మధ్య... రావణకాష్టం

ఆంధ్ర, తెలంగాణల మధ్య ఇక నిరంతరపోరు

**సోనియా చేసిన పాపం ఆంధ్రప్రదేశ్‌ను శాపంలా వెంటాడుతుంది. ఎటువంటి వివాదాలను పరిష్కరించకుండా, ఏ సమస్యలనూ తేల్చకుండా అపరిపక్వంగా ఆదరాబాదరా చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనకి ఆంధ్ర - తెలంగాణల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఆస్తులు, అప్పుల పంపకాల్లో ఆంధ్రకు పూర్తిగా అన్యాయం జరుగగా, విద్యుత్, జలపంపిణీలోనూ తెలంగాణతో జగడాలు తప్పడంలేదు. ఈ పరిస్థితికి పూర్తి బాధ్యత గత యూపిఏ ప్రభుత్వానిదే! వారు చేసిన పాపానికి ఈ రెండు రాష్ట్రాలు ఇక శాశ్వతంగా తన్నుకోవాల్సిందే!**

రుతు పవనాలు ఆలస్యం కావడం, వరుణుడి కరుణ లేక చినుకు జాడే కానరాకపోగా.. కరువు నీడ కమ్ముకుని వస్తుండడం.. మరోవైపు జలాశయాల్లో నీరు అడుగంటిపోవడం.. అరా కొరా వున్న నీటి కోసం వివాదాలు తప్పకపోవడం.. ఇదీ ప్రస్తుతం రాష్ట్రం ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితి. రాష్ట్ర విభజన జరిగితే సాగునీటికీ, తాగునీటికీ ఇబ్బందులు వస్తాయని, నీటికోసం యుద్ధాలు తప్పవని అందరూ వూహించినట్లే ఇప్పుడు జరుగుతోంది. అప్పుడే జలయుద్ధాలు ప్రారంభం అయ్యాయి కూడా. నీటి కేటాయింపుల విషయంలో సీమాంధ్రకు అన్యాయం జరుగుతోంది. కృష్ణా డెల్టాకు తాగునీరు అందించే విషయం రాద్ధాంతంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం నీటి విడుదలకు సానుకూలత వ్యక్తం చేయకపోవడంతో వివాదం కేంద్ర జలసంఘానికి వెళ్ళింది. రబీలో సాగునీటి అవసరాలకు, ఆగస్టు వరకు తాగునీటికి మొత్తంగా 10టిఎంసిల నీటిని విడుదల చేయాలని

(మిగతా 10వ పేజీలో)



# 'దేశం'వైపు వాకాటి చూపు



ఆంధ్రప్రదేశ్‌లో ఇక కాంగ్రెస్‌కు మనుగడ లేదు. తమిళనాడు, పశ్చిమబెంగాల్, బీహార్ లాంటి రాష్ట్రాలలో కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి ఎలా వుందో ఆంధ్రప్రదేశ్‌లోనూ అలానే ఉండబోతుంది. రాష్ట్ర విభజన పేరుతో కాంగ్రెస్ చేసిన ద్రోహాన్ని, దుర్మార్గాన్ని ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు ఇప్పుడిప్పుడే మరచిపోలేకపోవచ్చు. కష్టమో నష్టమో ఇక ప్రాంతీయ పార్టీలతో ఊరేగుతారేగాని కాంగ్రెస్‌ను మాత్రం ఆదరించే పరిస్థితి లేదు.

కాంగ్రెస్ బ్రతుకేంటో అర్ధమైన చాలామంది నాయకులు ఎన్నికలకు ముందే ఆ పార్టీని వదిలి ఇతర పార్టీల్లో చేరారు.

ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ భవిష్యత్ ఏ విధంగా ఉండబోతుందన్నది కళ్లకు కట్టినట్లయ్యింది. దీంతో కాంగ్రెస్‌లో అరకొర మిగిలిన వాళ్లు కూడా ఇప్పుడు అధికార తెలుగుదేశంపార్టీలోకి రావడానికి ఉత్సాహపడుతున్నారు. అలాంటి వారి జాబితాలో జిల్లాకుచెందిన శాసనమండలి సభ్యుడు వాకాటి నారాయణరెడ్డి కూడా ఉండడం విశేషం.

ఇటీవల ఏడు మంది కాంగ్రెస్ ఎమ్మెల్సీలు కట్టకట్టుకుని తెలుగుదేశంలో చేరిపోయారు. వారి బాటలోనే వాకాటి కూడా నడవొచ్చని తెలుస్తుంది. వాకాటికి అత్యంత సన్నిహితుడైన ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆయనను తెలుగుదేశంలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డికి ముఖ్య అనుచరునిగా గుర్తింపు పొందిన వాకాటి నారాయణరెడ్డి సూళ్లూరుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీకి పెద్దదిక్కులా వ్యవహరిస్తూ వచ్చారు. ఇక్కడ అసెంబ్లీ అభ్యర్ధుల ఎంపికలోనూ వాకాటి నిర్ణయమే కీలకంగా వుండేది. కాంగ్రెస్‌పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసిన వాకాటికి ఢిల్లీ స్థాయిలో పరిచయాలుండేవి. 2005లో ఆయన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ అయ్యారు.

2012లో నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల శాసనమండలికి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2014 ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభకు కాంగ్రెస్ అభ్యర్ధిగా పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రాని తరుణంలో వాకాటి ధైర్యం చేసి నిలబడ్డాడు. ప్రజలలో కాంగ్రెస్ పట్ల వున్న వ్యతిరేకత వల్ల ఆయనకు డిపాజిట్ కూడా దక్కలేదు. ఇక భవిష్యత్ లేని కాంగ్రెస్‌ను నమ్ముకుంటే తమకు భవిష్యత్ ఉండదని గ్రహించిన ఆయన తెలుగుదేశంలో చేరడానికి సిద్ధపడ్డట్లు తెలుస్తుంది.

## ఆనం కేడర్ అంతా... వైకాపాలోకి వలసపోయిందా?



- ఆ మూడు నియోజకవర్గాలలో వైకాపాకు 75వేల మెజార్టీ





***జిల్లాలో బలమైన రాజకీయ కుటుంబం ఆనం. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా వారి కేడర్ చెక్కు చెదరదంటారు. కాని అంతటి బలమైన కేడర్ నిన్నటి ఎన్నికల్లో ఏమైందనేది చిక్కు వీడని ప్రశ్న. ఆనం కేడర్ వారితో ఉండుంటే గెలిచివుండేవాళ్లు కాదేమోగాని కనీసం గౌరవప్రదమైన ఓట్లన్నా వచ్చేవి. కనీసం తెలుగుదేశంలోకన్నా వెళ్లి ఉంటే ఆ పార్టీయన్నా లబ్ది పొందేది.***

కాని ఆనం కేడర్ ఎక్కువ శాతం వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి పోయింది. దీనికి నిదర్శనం ఆనం కుటుంబసభ్యులు పోటీచేసిన నియోజకవర్గాలలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులకు వచ్చిన భారీమెజార్టీలే! జిల్లాలో 10అసెంబ్లీలకు గాను ఆనం కుటుంబసభ్యులు పోటీచేసిన నెల్లూరుసిటీ, నెల్లూరు రూరల్, ఆత్మకూరు అసెంబ్లీలను చూస్తే ఈ మూడింటిలోనూ వైకాపా అభ్యర్ధులే గెలిచారు. ఈ మూడు నియోజకవర్గాలలోనే వైకాపా అభ్యర్ధులకు రమారమీ 75వేల పైచిలుకు మెజార్టీ వచ్చింది. మిగిలిన 7అసెంబ్లీలో చూస్తే కావలి, గూడూరు, సూళ్లూరుపేట, సర్వేపల్లిలలో గెలిచిన వైకాపా అభ్యర్థుల మెజార్టీకి, ఉదయగిరి, వెంకటగిరి, కోవూరులలో గెలిచిన తెలుగుదేశంపార్టీ అభ్యర్థుల మెజార్టీకి పెద్ద వ్యత్యాసం లేదు. ఈ ఏడు నియోజకవర్గాల్లో చాలా తక్కువ మెజార్టీలే వచ్చాయి. కాని ఆనం కుటుంబసభ్యులు పోటీ చేసిన మూడు నియోజకవర్గాల్లో మాత్రమే భారీ మెజార్టీలు ఉన్నాయి. ఆత్మకూరులో ఆనం రామనారాయణరెడ్డికి, నెల్లూరు నగరంలో ఏ.సి.సుబ్బారెడ్డికి, నెల్లూరురూరల్‌లో ఆనం విజయకుమార్‌రెడ్డిలకు కనీసం డిపాజిట్లు కూడా దక్కలేదు. అయితే ఆనం వారి ఒరిజినల్ ఓట్లు మాత్రం ఇవి కావు. ఏ పార్టీ తరపున పోటీ చేసినా వాళ్లకు పడే ఓట్లు ప్రత్యేకంగా వుంటాయి. నిన్న ఎన్నికల్లో ఆ ఓట్లు పడలేదు. ఆనం కేడర్ మొత్తం వైకాపాకు వలసపోయిందనేది వారు పోటీ చేసిన నియోజకవర్గాల్లో వైకాపా మెజార్టీలను బట్టి చెప్పేయొచ్చు.

ఆత్మకూరులో ఆనం రామనారాయణరెడ్డి గెలిచే పరిస్థితి వున్నా, ఆయన ఎలక్షన్ చేయక ఓడిపోయాడు. దీనివల్ల ఆయన్నే నమ్ముకుని వున్న కేడర్ అంతా వైకాపాలోకి వెళ్లిపోయింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో కాంగ్రెస్ మీద ఏర్పడ్డ వ్యతిరేక వాతావరణంతో నెల్లూరునగరం, రూరల్ నియోజకవర్గాలలో భారీస్థాయిలో ఆనం అనుచరవర్గం వైకాపాలో చేరిపోయింది. ఆనం కేడర్ బలంగా చేరడం వల్లే నెల్లూరు పార్లమెంటులో మేకపాటి రాజమోహన్‌రెడ్డి బయటపడడంతో పాటు నెల్లూరు సిటీ, రూరల్, ఆత్మకూరులలో వైకాపాకు భారీ మెజార్టీలు రాగలిగాయి.

## నోరు మెదపని ఎమ్మెల్యేలు

రాష్ట్ర విభజన తర్వాత జరిగిన తొలి ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలలో జిల్లాకు చెందిన పదిమంది ఎమ్మెల్యేలలో ఏ ఒక్కరూ నోరు మెదప లేదు. ఎవరికీ మాట్లాడే అవకాశం కూడా రాలేదు.

నిన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ నుండి ఏడు మంది, తెలుగుదేశం నుండి ముగ్గురు ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. అయితే ఈ పదిమందిలో ఏ సబ్జెక్ట్ మీదైనా అనర్గళంగా మాట్లాడ గలిగింది నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఒక్కరే! మిగతా వాళ్లకు వాయిస్ లేదు. పదిమందిలో 8మంది అసెంబ్లీలో తొలిసారిగా అడుగుపెట్టిన వాళ్లే. కురుగొండ్ల రామకృష్ణ, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు రెండోసారి గెలిచినప్పటికి వాళ్లకీ, వీళ్లకు పెద్ద తేడా లేదు.


ఆనం బ్రదర్స్, సోమిరెడ్డి, ప్రసన్న, బీద వంటి సీనియర్లు లేని లోటు కనిపిస్తుంది. కనీసం ఎమ్మెల్యేలు ప్రైవేట్‌గా శిక్షణ తీసుకునైనా అసెంబ్లీలో తమ వాదనలు వినిపించాల్సివుంది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## వైకాపా కమిటీలో.. నెల్లూరు ఎమ్మెల్యేలు









వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ శాసనసభ పక్ష కమిటీలో నెల్లూరుజిల్లాకు చెందిన నలుగురు ఆ పార్టీ ఎమ్మెల్యేలకు చోటు దక్కింది. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కమిటీ కార్యదర్శిగాను, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డిని సమన్వయకర్తగాను, నెల్లూరు ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను కార్యనిర్వాహక సభ్యునిగాను నియమించారు. ఇక ఎలాంటి అంశంమీదైనా ఆపకుండా మాట్లాడగలిగే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి అతనికి తగ్గట్లుగా అధికార ప్రతినిధిగా నియమించారు.

# నెరవేరిన 'ఎమ్మెల్యే' లక్ష్యం



బెజవాడ గోపాలరెడ్డి, వెంకయ్యనాయుడు వంటి ఉద్ధండులు ప్రాతినిధ్యం వహించిన ఉదయగిరి అసెంబ్లీ నుండి ఎమ్మెల్యేగా గెలుపొందడం ఒక అదృష్టం. ఈ మెట్ట ప్రాంతానికి ఎమ్మెల్యేగా పని చేయడం కాదు, ప్రజల మెప్పు పొంద గలిగితే అంతకంటే కావాల్సిందేముంది. ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు రాజకీయ చైతన్యవంతులు. ఇక్కడ పార్టీల ప్రభంజనాలు, గాలుల కంటే అభ్యర్థుల గుణగుణాలను, వారి మంచితనం, మాటతీరును బట్టి తీర్పు ఇస్తుంటారు. 1978లో జిల్లాలో అన్ని సీట్లను కాంగ్రెస్ గెలిస్తే ఉదయగిరిలో మాత్రం జనసంఘ్ అభ్యర్థిగా వెంకయ్యనాయుడు గెలిచాడు. 1983లో జిల్లాలోని 10సీట్లను ఎన్టీఆర్ గాలిలో తెలుగుదేశం గెలుచుకుంటే ఉదయగిరిలో మాత్రం తన వ్యక్తిగత సామర్థ్యంతో బీజేపీ అభ్యర్థిగా మళ్ళీ వెంకయ్యనాయుడే గెలిచాడు. ఉదయగిరి ప్రజల తీర్పు ఎంత భిన్నంగా ఉంటుందో అనడానికి ఇవి ఉదాహరణలు.

2014ఎన్నికల్లో తన నోటి దురుసుతో వైకాపా అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఓటర్లకు దూరంకాగా, దానిని అవకాశంగా తీసుకున్న తెలుగుదేశం అభ్యర్థి బొల్లినేని రామారావు విజయాన్ని చేజిక్కించుకున్నారు. కలిగిరి మండలంకు చెందిన రామారావు స్వతహాగా కాంట్రాక్టర్. ఆయన రాజకీయ రంగప్రవేశం అనూహ్యంగా జరిగింది. 1985 నుండి ఉదయగిరి నియోజకవర్గంలో మేకపాటికి కంభం విజయరామిరెడ్డికి మధ్య రాజకీయ యుద్ధం నడుస్తుండేది. 1989 నుండి రాజకీయాలలో డబ్బు ప్రాబల్యం పెరిగింది. మేకపాటి ఆర్థికంగా శక్తివంతుడు కావడం, కంభంకు ఆర్థికశక్తి చాలక పోవడంతో నియోజకవర్గంలో పరిస్థితులు తారుమారవుతూ వచ్చాయి. అప్పటికీ కంభం విజయరామిరెడ్డి 2009 ఎన్నికల వరకు వారితో పోరాడుతూ వచ్చాడు. 2004, 2009ఎన్నికల్లో ఆర్థిక బలం లేక ఆయన ఓటమిపాలు కావడంతో బొల్లినేని రామారావు పేరు తెరమీదకొచ్చింది. 2012లో కంభం కాంగ్రెస్‌లో చేరడంతో బొల్లినేని రామారావును తెలుగుదేశం పార్టీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. 2012లో ఉదయగిరి అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో వైకాపా నుండి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, తెలుగుదేశం నుండి బొల్లినేని రామారావు, కాంగ్రెస్ నుండి కంభం విజయరామిరెడ్డి తలపడ్డారు. ఆ ఎన్నికల్లో మేకపాటి గెలిచాడు. అయినా బొల్లినేని రామారావు నియోజకవర్గాన్ని విడిచిపెట్టలేదు. ఇన్‌ఛార్జ్‌గా తన బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చాడు. పంచాయితీ, సహకార, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం నాయకులకు ఆసరాగా నిలిచాడు. తద్వారా గ్రామస్థాయిలో పార్టీ కేడర్‌ను పటిష్ట పరిచాడు. కంభం విజయరామిరెడ్డి, మెట్టుకూరు చిరంజీవిరెడ్డి లాంటి వారిని తెలుగుదేశంలోకి తీసుకొచ్చి వారి సహకారాన్ని పొందాడు. అందరినీ సమన్వయం చేసుకుని నిన్నటి ఎన్నికల్లో తన గెలుపుకు రాచబాటను వేసుకున్నాడు. ఎమ్మెల్యే కావాలన్న తన కలను నెరవేర్చుకున్నాడు.

# మాఫీ కోసం ఎదురుచూపు



ఋణమాఫీ కోసం జిల్లాలోని అన్నదాతలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. మొన్న ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ చేసిన ఋణమాఫీ వాగ్దానం మన జిల్లాలో కూడా పని చేసింది. ఎన్నికలకు ముందైతే ఆయా బ్యాంకుల వద్ద ఏ నలుగురు రైతులు కలిసినా ఋణమాఫీ గురించే చర్చించుకున్నారు. 2009లో ఒకసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఋణాలు రద్దు చేయడంతో రైతుల్లో అదొక నమ్మకమైపోయింది. ఎన్నికలొస్తే ఏదో ఒక పార్టీవాళ్లు ఋణమాఫీ చేస్తారనే నిర్ధారణకొచ్చారు. అనుకున్నట్లే మొన్న ఎన్నికల్లో తెలుగుదేశం ఋణమాఫీ వాగ్దానం చేసింది. ఆ పార్టీయే అధికారంలోకి వచ్చింది.

అయితే చంద్రబాబు సీఎం కాగానే తమ అప్పులన్నీ రద్దవుతాయనుకున్న అన్నదాతల ఆశలు మాత్రం అడియాశలయ్యాయి. ఋణమాఫీని అధ్యయనం చేయడానికి చంద్రబాబు ఒక కమిటీని వేసారు. ఎవరెవరి ఋణాలు మాఫీ చేయాలి, ఎలాంటి ఋణాలు రద్దు చేయాలి, ఎంతవరకు ఋణం మాఫీ చేయాలనే దానిమీద కోటయ్య కమిటీ కుస్తీలు పడుతుంది. ఋణమాఫీకి బ్యాంకులు సహకరించడం లేదు. ఆర్‌బిఐ ఒప్పుకోవడం లేదు. ప్రభుత్వం జారీచేసే బాండ్లకు అంగీకరించడం లేదు. ఈ నేపథ్యంలో ఋణమాఫీ ప్రభుత్వానికి పెద్ద గుదిబండగా మారింది.

ఇంకో పక్క చూస్తే బ్యాంకులు మాత్రం అప్పులు కట్టాలంటూ రైతులకు నోటీసులు జారీ చేస్తున్నాయి. అప్పులు మాఫీ అవుతాయనుకుంటున్న రైతులు ఈ నోటీసులను చూసి ఆందోళన చెందుతున్నారు. ఇచ్చిన అప్పులు కడితేనే గాని కొత్త అప్పులు ఇవ్వమని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం నుండి ఋణమాఫీపై ఇంకా స్పష్టత రాలేదు.

జిల్లాలో 342 బ్యాంకు శాఖల ద్వారా రైతు ఋణాలు 2వేల కోట్లకు పైనే వున్నట్లు తెలుస్తుంది. చంద్రబాబు ఋణమాఫీ వాగ్దానం వల్ల తీసుకున్న ఋణాలను పద్ధతిగా కట్టేవాళ్లు కూడా ఇప్పుడు కట్టడం మానేసారు. 2012 సెప్టెంబర్ వరకు చూస్తే వెయ్యి కోట్లు, 2014 వరకు చూస్తే 2వేల కోట్లు రైతుల బకాయిలున్నాయి. ఋణమాఫీ పై ప్రభుత్వం ఏమీ తేల్చకపోవడంతో కొత్త ఋణాలపై బ్యాంకులు దృష్టి పెట్టడం లేదు.

# అసంతృప్తితో వెంకయ్య...

***ఆయన నెలకొకసారయినా నెల్లూరుకు రావాల్సిందే! నెల్లూరులో సొంత ఇంటిలో, వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో గడపాల్సిందే! దేశమంతటా పర్యటనలు చేస్తున్నా నెలకోసారన్నా నెల్లూరుకు రానిదే మనసు ఒప్పుకోదు. సొంతూరుకి బయల్దేరమని బలవంతం చేస్తుంటుంది. కాని ఈసారి ఆయన తన మనసు మాటను వినడం లేదు. సొంతూరుకు రావాలంటేనే చాలా ఇబ్బందిగా ఫీలవుతున్నాడు. ఆయనెవరో కాదు... మన కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యానాయుడే!***

ఎన్నికలకు ముందు ప్రచారంలో భాగంగా నరేంద్ర మోడీతో పాటు వెంకయ్యానాయుడు జిల్లాకు వచ్చాడు. ఆ తర్వాత వ్యక్తిగతంగా జిల్లాలో నిర్వహించిన రోడ్‌షోలలోనూ పాల్గొన్నారు. మే 16న ఎన్నికల ఫలితాలు వచ్చాయి. దేశమంతటా బీజేపీ విజయదుందుభి మోగించింది. ఈసారి 300కుపైగా సీట్లు సాధిస్తామన్న వెంకయ్యానాయుడు మాటలు అక్షర సత్యమయ్యాయి. నరేంద్ర మోడీని ప్రధానిగా చూడాలనుకున్న ఆయన కల కూడా నెరవేరింది. అయితే ఇది ఆయనకు పూర్తిగా సంతృప్తినివ్వలేదు. తన సొంతజిల్లాలో వున్న నెల్లూరు, తిరుపతి లోక్‌సభ స్థానాలలో బీజేపీ, తమ మిత్రపక్షమైన తెలుగుదేశం అభ్యర్థులు గెలవకపోవడం ఆయనకు తీరని మనస్థాపం కలిగించాయి. నెల్లూరులో తెలుగుదేశం అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తిరుపతిలో బీజేపీ అభ్యర్థిగా కారుమంచి జయరాంలు గట్టిపోటీ ఇచ్చి తక్కువ మెజార్టీతో ఓడిపోయారు. అసెంబ్లీ ఫలితాలు ఎలా వున్నా జిల్లా ప్రజలు నరేంద్ర మోడీని, వెంకయ్యానాయుడును దృష్టిలో పెట్టుకుని లోక్‌సభలో బీజేపీ, టీడీపీలను గెలిపించి వుంటే వెంకయ్యకు కొంచెం బాగుండేది. మా సొంత జిల్లాను అభివృద్ధి చేసుకోవాలనే ఉత్సాహం ఉండేది. దేశంలో వున్న 543పార్లమెంటు స్థానాలలో ఎన్డీఏ 335స్థానాలు గెలిస్తే, అందులో వెంకయ్య సొంత పార్లమెంట్ లేదంటే బాధ కలిగించే విషయమే. ఈరోజు కేంద్ర కేబినెట్‌లోని టాప్-5లో వెంకయ్య ఒకరు. మీ పార్లమెంటులో ఎవరు గెలిచారని ఎవరైనా అడిగితే ఆయనకు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ గెలిచిందని చెప్పడానికి ఎంతో కష్టంగా ఉంటుంది. వెంకయ్యకు ఈ రాష్ట్రం నుండి అత్యున్నత పదవులు రాకపోయినా ఈ రాష్ట్రం మీద, ఈ జిల్లా మీద మమకారం వున్న మనిషి. ఆయన రాజకీయ జీవితానికి పునాది వేసింది ఉదయగిరి ప్రజలు. 1978, 1983 ఎన్నికల్లో ప్రభంజనాలను కూడా లెక్కచేయకుండా అభిమానంతో వెంకయ్యను గెలిపించారు. ఉదయగిరిని దాటాక వెంకయ్యకు గెలుపు లేకుండా పోయింది. 1985లో ఆత్మకూరు అసెంబ్లీ నుండి ఓడిపోయారు. ఆ తర్వాత బాపట్ల, హైదరాబాద్‌లలో లోక్‌సభకు పోటీ చేసి ఓటమి చెందారు. అప్పట్నుండి ఇక ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్న ఆయన కర్నాటక నుండి రాజ్యసభ సభ్యుడిగా ఎంపికవుతూ వస్తున్నారు. ఆ రాష్ట్ర ఎంపీగానే 1999లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి అయ్యారు. కేంద్రమంత్రిగా జిల్లాపై ఉన్న మమకారంతో ఎన్నో అభివృద్ధి పనులు చేసారు. దాదాపు 30మందికిపైగా కేంద్రమంత్రులను నెల్లూరుకు తీసుకురాగలిగారు. ఇటీవల రాష్ట్ర విభజన విషయంలో సీమాంధ్రకు న్యాయం చేయడం కోసం శాయశక్తులా కృషి చేసారు.

నెల్లూరుజిల్లా అభివృద్ధికి కృషి చేసిన రాజకీయ నాయకులను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. అయితే వీరందరూ నెల్లూరుజిల్లా నుండి వివిధ పదవులు పొంది పనులు చేసినవారే! కాని తన పదవికి నెల్లూరుజిల్లాతో ఎటువంటి సంబంధం లేకపోయినా ఆ పదవుల ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధికి పాటుపడిన వ్యక్తి వెంకయ్య. కాని నిన్నటి ఎన్నికల ఫలితాలు ఆయనను కలత చెందేలా చేసాయి. అందుకే కేంద్రమంత్రి అయ్యి నెలదాటాక కూడా నెల్లూరుకు రాలేదు. ఇంకో పక్క రాష్ట్రంలో హైదరాబాద్, విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి నగరాలలో తిరిగాడు. కాని నెల్లూరు రావాలంటేనే బాధపడుతున్నాడు. ఈ నెల 29న ప్రధానితో పాటు షార్‌కు వస్తున్నా తిరిగి అటు నుంచి అటే ఆయనతో పాటూ వెళ్లనున్నారు. వెంకయ్య ఆగష్టు తర్వాత నెల్లూరుకు వచ్చే అవకాశముంది. అప్పటికి కూడా ఈ బాధ కొంత తగ్గితే!

కన్న ఊరు, అమ్మ ప్రేమ, మాతృభాషను ఎంతగానో ప్రేమించే వెంకయ్యకే కన్నతల్లి లాంటి నెల్లూరు మీద కోపమొచ్చిందంటే ఫలితాలు ఆయనను ఎంత నిరాశకు గురిచేసాయో అర్థమవుతుంది.

### కేంద్రమంత్రి వెంకయ్యను కలిసిన...

# మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ సభ్యులు



నెల్లూరులో అతిముఖ్యమైన ప్రాంతం మాగుంట లే అవుట్ అభివృద్ధికి సహకరించాలని మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కనుమూరు శ్రీనివాసులురెడ్డి, సహకార్యదర్శి దండమూడి హేమంత్‌కుమార్‌లు కేంద్ర పార్లమెంటరీ మరియు పట్టణాభివృద్ధి శాఖామంత్రి యం.వెంకయ్యానాయుడును కోరారు.

ఈ నెల 21వ తేదీ శనివారం చెన్నైలోని రెయిన్‌ట్రీ హోటల్‌లో వెంకయ్యానాయుడును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకయ్యానాయుడు మాగుంట లేఅవుట్ అభివృద్ధిపై, అక్కడ నెలకొన్న సమస్యలపై అసోసియేషన్ సభ్యులతో స్వయంగా చర్చించారు. లే అవుట్లు అప్రూవల్స్ ఇచ్చేముందే డ్రైనేజీ, రోడ్లు వంటి వసతులపై మున్సిపాల్టీలు దృష్టిపెడితే ఎటువంటి సమస్యలు రావని ఆయన అభిప్రాయపడ్డారు. త్వరలో నెల్లూరుకు వస్తానని, మాగుంట లే అవుట్ ప్రాంతాన్ని కూడా సందర్శిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# విద్యార్థులకు వేమిరెడ్డి ప్రతిభా పారితోషకాలు



నెల్లూరుజిల్లాలో ఎన్నో సేవా కార్యక్రమాలకు తనవంతు చేయూతనందిస్తున్న ప్రముఖ సేవాతత్పరుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మరోసారి తన దానగుణాన్ని నిరూపించుకున్నారు. వైద్య, విద్య, ఆధ్యాత్మిక రంగాలకు ఆయన అందిస్తున్న సేవలు అపురూపం.

ఈ పరంపరలోనే తన సొంత నిధులు 10లక్షల రూపాయలను విద్యార్థుల అభ్యున్నతి కోసం వెచ్చించారు. నెల్లూరు రామ్మూర్తినగర్‌లోని శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఇటీవల పలుప్రాంతాల విద్యార్థులకు విద్యాసామగ్రి, ప్రతిభా పారితోషికాలను ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో ఉన్నత స్థాయిని పొందాలని, సేవాసమితి ఈ కార్యక్రమం జరపడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు 'కృషితో నాస్తి దుర్భిక్షం' సూక్తిని ఆదర్శంగా తీసుకుని కష్ట పడుతూ ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జడ్పీ సీఇఓ జితేంద్ర, జడ్పీ మాజీ ఛైర్మెన్ దేగా నరసింహారెడ్డి, మాడరన్ స్కూలు అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి, సత్యసాయి భజన మందిరం నిర్వాహకులు, సత్యనారాయణ, శ్రీ సత్యసాయి సేవా సమితి బాధ్యులు వి.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన ధరలు... అల్లాడుతున్న ప్రజలు

***అసలు ఇవి కూరగాయలేనా అని?..ఏదో బంగారపు కడ్డీలైనట్లు ఏమిటా ధరలు?..తాకితేనే చెయ్యి కాలిపోతున్నట్లు మరీ అంతంత ధరలా?.. ఇంతింత ధరలతో ఏం తినగలం?..ఏం కొనగలం?..అంటూ సామాన్య ప్రజలు, నిరుపేద గృహిణులు బెంబేలెత్తి పోతున్నారు. ఏవో నాలుగు మెతుకులు ఉడకేసుకుని ఏదో ఒక కూర చేసుకుందామంటే..మరీ ఇంత ఘోరమా?.. కలికాలం కాకపోతే..ఏ కూరగాయలు కొనాలన్నా అవి కొనేట్టు వున్నాయా అని?... ఇదీ సామాన్య ప్రజల ఆవేదన.***

ఏ మార్కెట్‌లోకి వెళ్ళినా వారి మనసుల్లోని మాటలు కాదు..అనేకమంది బాహాటంగానే అంటున్న మాటలివి. నిజమే మరి!.. నెల్లూరు నగరంలోని కూరగాయల మార్కెట్లలోకి వెళ్తే చాలు..జేబులో డబ్బులన్నీ ఖాళీ కావాల్సిందే కానీ సంచీ మాత్రం నిండదు. ధరలు ఆకాశానికి అంటుతుంటే, వాటినెలా కొనాలో తెలియక.. సామాన్య ప్రజలు బిక్కుబిక్కుమంటూ దిక్కులు చూడాల్సిందే. ఒకవేళ ఏమైనా కొందామని సాహసించి కాస్త బేరమాడితే చాలు..'భలే కొన్నావులే..పోవయ్యా'..అంటూ దుకాణదారులు కసిరికొడ్తారు. వారు ఎంత చెప్తే అంత ఇవ్వాల్సిందే.. సంచిలో ఏమి వేస్తే అది తీసుకోవాల్సిందే. మరో గత్యంతరం వుండదు. నిత్యం ఇదే బాధ. ఎవరికి చెప్పుకోవాలి ఈ ఆవేదన?..చెప్పినా వినేదెవరూ?..కష్టాలు తీర్చేదెవరూ?.. ఎందుకింతగా ధరలు మండిపోతున్నాయని నోరుజారి అడిగామనుకోండి...ఆ మాత్రం కూడా తెలియదా?...అసలే మండే ఎండాకాలం..వానలుంటే కదా..కూరగాయలు పండడానికి.. మీకంతా తక్కువకి ఇయ్యడానికి..అంటూ వ్యాపారుల రుసరుస. ఈ వారంలో కూడా షరా మామూలుగానే ధరలు భగ్గుమన్నాయి. టమోటాల ధర కిలో రూ.20 వుండగా, మిరపకాయలు కూడా అంతే ధర పలికాయి. వంకాయలు, ఉల్లగడ్డలు కిలో 30 రూపాయలు పలికితే, బీనీసు ధర నేనేం తక్కువ తిన్నానా అన్నట్లు ఒక్కసారిగా రూ. 50 పలికింది. గోరుచిక్కుడుకాయల ధరే 20 రూపాయలుంటే, ఇక నేనెంత వుండాలీ అన్నట్లు పందిరి చిక్కుడు ధర ఏకంగా 50 రూపాయలు పలికింది. బెండకాయలు, దొండకాయలు, చేమగడ్డలు ఏవి కావాలన్నా 20 రూపాయలు అక్కడ పెట్టాల్సిందే. కందగడ్డల ధర వింటే మన ముఖం కూడా కోపంతో అలా కావాల్సిందే.. వాటి ధర అక్షరాలా ముప్పై రూపాయలు. అయినా మన డబ్బులేమన్నా ఈ కూరగాయల్లాగా చెట్లకి కాస్తున్నాయా?..ఎంతడిగితే అంత ఇయ్యడానికి...అంటూ నిరుపేదలు ఆగ్రహంతో భగ్గుమంటున్నారు. చివరికి మునక్కాయలు కావాలన్నా రూ.30 ఇవ్వాల్సిందే. కాకరకాయలు, క్యాలీఫ్లవర్ ధర కూడా అంతే..రూ.30 ఇస్తే తప్ప ఏమీ రాని పరిస్థితి. ఇక పొరపాటున బీనీసు కొందామనుకున్నామో... మళ్ళీ ఇంటికి వెళ్ళి డబ్బు తేవాల్సిందే.. ఈ వారంలో అది కిలో 80 రూపాయల దాకా పలికింది. అంతేకాదు, కనీసం పాతిక రూపాయలు లేనిదే కిలో బీరకాయలు రావడం లేదు. అవి ముదురువో లేతవో చూద్దామంటే..ఈ ఎండాకాలం ఇంతకన్నా లేతగా ఎక్కడుంటాయ్..అని దుకాణాదారుల నసుగుడు. అంతేనా అంటే..ఇంకా చెప్పాల్సింది చాలా వుంది. గతంలో రూపాయికి నాలుగేసి కట్టలు వచ్చే ఆకుకూరలు కూడా ఇప్పుడు పది రూపాయలిచ్చినా మూడు కట్టలు కూడా రావడం లేదు. ఇంకొన్నాళ్ళుపోతే ఆకుకూర కట్ట కావాలన్నా10 రూపాయలు ఇవ్వక తప్పదేమో?...పాతరోజుల్లోనైతే రూపాయికి కూరలు కొన్నా ఓ కరివేపాకు కట్ట ఉచితంగా బుట్టలో పడేసేవారు. ఇప్పుడు కరివేపాకే కాదు..ఏ ఆకు కావాలన్నా రూపాయలు బయటకు తీయాల్సిందే. ఇలా నిత్యం తప్పనిసరిగా కావాల్సిన కూరగాయల ధరలు ఏరోజుకారోజు బిరబిరా పెరిగిపోతున్నా అడిగేవారూ.. అడ్డుకునేవారు లేరు. అధికారులు, పాలకులు ఎప్పటికప్పుడు ధరలను నియంత్రిస్తామని ప్రకటనలు అదేపనిగా గుప్పిస్తుంటారే తప్ప మార్కెట్లలోకి వచ్చి విచారించేదీ వుండదు.. ప్రజల బాధలు తీర్చేదీ వుండదు. బీదాబిక్కీ జనం ఎక్కువగా కొనుగోలు చేసే మిరపకాయలు, ఎర్రగడ్డలు, బెండకాయలు, గోంగూర, తోటకూర వంటివి కూడా ఏకంగా ఆకాశానికంటిపోతుంటే ఇక వాటిని ఎలా కొనాలి? అవేమీ లేకుండా ఏం తినాలి, ఎలా బతకాలన్నది అర్థమే కావడం లేదని సామాన్యులు, పేదలు రోజూ ఆవేదన చెందుతూనే వున్నారు. కిలో కూరగాయలు అవసరమైనవారు కూడా భగ్గుమంటున్న ఈ ధరలను చూసి పావుకిలో చాలనుకునే దుస్థితి. అధికారులూ! ఇకనైనా సామాన్యులను కాస్త కనికరించండి. మార్కెట్లలో ధరలను సమీక్షించండి. నాణ్యమైన సరుకులను న్యాయమైన ధరలకు అందించే ఏర్పాటు చేయండి. ఆకాశానికంటుతున్న కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలను ఇకనైనా రెక్కపట్టుకుని నేలకి దించి కాస్త పుణ్యం కట్టుకోండి. సామాన్యులు ఒక పూటైనా సంతృప్తిగా అన్నం తినే భాగ్యం కల్పించండి!

**ఏం కొనేటట్టు లేదు..ఏం తినేటట్టు లేదు!**






## నారాయణ మంత్రం

నరేంద్ర మోడీ అనే ఓ ఛాయ్ వాలా ఈరోజు ప్రధాని అయ్యాడు. వారాలబ్బాయిగా వున్న మన నారాయణ మంత్రి అయ్యారు. డెమాన్‌స్ట్రేటర్‌గా తాత్కాలిక ఉద్యోగం పొంది ట్యూషన్‌లు చెబుతూ పట్టుదలతో ఎదిగారు. కృషితో ఎదిగిన కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు బాటలోనే నారాయణ నడవాలి. వీరి ద్వారా నెల్లూరు నగరాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దాలి.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## వై.వి. ఎంపిక హర్షణీయం

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ పార్లమెంటరీ చీఫ్‌విప్‌గా ఒంగోలు ఎంపీ వై.వి.సుబ్బారెడ్డిని నియమించడం హర్షణీయం. కష్టకాలంలో జగన్‌కు కొండంత అండగా నిలిచిన వ్యక్తి వై.వి.సుబ్బారెడ్డి. కాని మేకపాటి రాజమోహన్‌రెడ్డిని పార్లమెంటరీ పార్టీ నేత బాధ్యతలు అప్పగించడం సమర్ధనీయం కాదు. జిల్లాలో మూడు ఎమ్మెల్యే సీట్లను వారి వల్లే కోల్పోవాల్సి వచ్చింది.

బి.శాలి, కావలి.

## పెంపు సమంజసమే

కేంద్రప్రభుత్వం రైల్వే ఛార్జీలు పెంచడం సమంజసమే. అయితే ప్రయాణీకులపై ఒకేసారి భారీగా భారం మోపడం తగదు. ప్రతి ఏడాది కొంత శాతం వరకు రైలు ఛార్జీలను పెంచుతుండాలి. తద్వారా పెరిగే ఆదాయంతో ఎప్పటికప్పుడు రైల్వేను ఆధునికీకరిస్తుండాలి. కాని గత ప్రభుత్వాలు ఛార్జీలు పెంచక, రైల్వేను ఆధునికీకరించక నిర్లక్ష్యం చేసాయి. ఆ పాత కాలపు పోకడలకు చెల్లుచీటీ వ్రాయాలి.

సి.దీప్తి, నెల్లూరు.

## పార్కింగ్‌కు స్థలమేది

నెల్లూరు నగరంలో చాలా షాపింగ్‌మాల్స్‌కు పార్కింగ్‌కు సౌకర్యం లేదు. దీనివల్ల స్కూటర్లు, కార్లు రోడ్డు మార్జిన్‌లో పార్కింగ్ చేస్తున్నందున ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పుడు కట్టే చాలా వాటికి కూడా పార్కింగ్‌కు స్థలం వదలడం లేదు. కార్పొరేషన్ సిబ్బంది దీనిపై శ్రద్ధ చూపి, పార్కింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలి.

లక్ష్మీకృష్ణ, నెల్లూరు.

# 'ప్రభా'తం

భారత ప్రధానిగా నరేంద్రమోడీ పాలన ఈ నెల 26వ తేదీ నాటికి తొలి నెల గడిచింది. ఈ నెల రోజుల్లో అనేక అద్భుతాలు ఆవిష్కృతమయ్యాయి. భారత ప్రజల ఆశాజ్యోతిగా మోడీ ప్రధాని పీఠం అధిష్టించిన తర్వాత, ప్రజల్లో ఆయన పాలనపై ఆశలు మోసులెత్తుతున్నాయి.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, సకలజనరంజకంగా మోడీ పాలన సాగిస్తారని అందరూ అనుకున్నట్లే ఆయన క్షణం తీరికలేకుండా దేశాభ్యున్నతికి అవసరమైన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. ప్రధాని పదవీ ప్రమాణ స్వీకారం రోజునే ఇరుగుపొరుగు దేశాలతో మైత్రీభావం పెంపొందేవిధంగా సార్క్ దేశాల నేతలను ఆహ్వానించడం, భూటాన్‌లో తొలి విదేశీ పర్యటనలోనే భారత్ స్నేహశీలతను స్పష్టం చేయడం వంటివి ఆయన నిబద్ధతకు నిదర్శనాలు. సుస్థిర పాలన.. సుపరిపాలన లక్ష్యంతో ప్రధాని ఎంతో విజ్ఞతతో, అటు పార్టీ పరంగానూ, ఇటు పాలనా పరంగానూ అన్ని విధాలుగా ప్రజలకు మేలైన విధానాలు రూపొందిస్తూ ముందుకు సాగుతుండడం సంతోషదాయకం. ఇంతకాలంగా పాలనాపరంగా సరైన పర్యవేక్షణ లేక ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు పేరుకుపోయివున్న నేపథ్యంలో, నీతి నిజాయితీలకు ప్రాధాన్యత ఇస్తూ, దేశ ప్రతిష్టను ఇనుమడించే విధంగా ప్రధాని మోడీ విధి విధానాలు రూపొందించుకుని, వాటి అమలుకు నడుము బిగించారు. అవినీతి, అక్రమార్కుల భరతం పట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటూనే, ప్రజలకు ప్రయోజనకరమైన పథకాల అమలుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. అధిక ద్రవ్యోల్బణం, ద్రవ్య లోటు తదితర సమస్యలతో దేశ ఆర్థికరంగం అతలాకుతలంగా వుండడంతో, ఆ సమస్యలన్నిటినీ అధిగమించేందుకు కొన్ని కఠినమైన నిర్ణయాలు కూడా తీసుకుంటున్నారు. ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను అమలుచేసేందుకు ప్రధాని అయిన తొలి రోజు నుంచే ఆయన కంకణబద్ధుడు కావడం, గంగా నది ప్రక్షాళనకు ప్రత్యేక మంత్రిత్వం ద్వారా శ్రీకారం చుట్టడం, పరిశుభ్ర భారత్ నిర్మాణానికి పునాది వేయడం వగైరా కార్యక్రమాలన్నిటితో పాటు, నిజాయితీతో నిబద్ధతతో పనిచేసే నాయకులను మంత్రులుగా చేర్చుకోవడం, దేశంలో అన్ని రంగాలు, అన్ని ప్రాంతాలు సమగ్రాభివృద్దిని సాధించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించేందుకు సమాయత్తం కావడం..వగైరాలన్నీ మోడీ మార్కు పాలనకు చిహ్నాలుగా నిలిచి, ప్రజలందరి ఆదరాభిమానాలను పొందుతున్నాయి. పాలనాపరంగా ఇన్నాళ్లూ.. ఇన్నేళ్ళూ పేరుకుపోయివున్న ఫైళ్ల బూజు దులిపి, అస్తవ్యస్తంగా మారివున్న దేశ ఆర్థికవ్యవస్థను చక్కదిద్దడానికి ప్రధాని మోడీ ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేస్తున్నారు. సంస్కరణల దిశగా అడుగులు వేస్తూ, ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్నారు. ముందెన్నడూ లేని విధంగా, శాస్త్ర సాంకేతిక రంగాల ద్వారా అనూహ్యమైన ప్రగతిని సాధించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. మోడీ కలల ప్రాజెక్టుగా పేరొందిన గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్‌లో లక్షలాది మందికి ఉద్యోగాలు లభించేలా చేసేందుకు తీవ్ర కృషి చేస్తున్నారు. రుతుపవనాలు ఆలస్యం కావడంతో, ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు దాపురిస్తాయేమోనని నిపుణులు సూచిస్తున్న నేపథ్యంలో, అలాంటి విపత్కర పరిస్థితులను సైతం అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విశ్లేషణలు జరుపుతున్నారు. ధరలు పెరిగిపోయి, ప్రజల్లో కొనుగోలు శక్తి బాగా సన్నగిల్లిపోయి, సామాన్యుని జీవన పరిస్థితులు సంకటంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో, శరపరంపరగా వస్తున్న అన్ని రకాల సవాళ్ళను సంయమనంతో ఎదుర్కొంటూనే, ప్రగతి రథాన్ని ముందుకు కదిలించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఇటు మన రాష్ట్రాభివృద్ధికి చేపట్టాల్సిన ప్రగతి పనులకు చేయూతనందిస్తున్నారు. ఎన్నికలకు ముందు చెప్పిన మాటలను నిలబెట్టుకునేందుకు, ప్రజలకిచ్చిన బాసలు నెరవేర్చేందుకు, అవినీతి అక్రమాల భరతం పట్టేందుకు, అన్నిటికీ మించి నల్లధనాన్ని బయటకు రప్పించేందుకు ప్రధాని సకల చర్యలూ తీసుకుంటున్నారు. పన్నులు ఎగ్గొట్టి కోటానుకోట్ల రూపాయలను అక్రమంగా స్విస్ బ్యాంకుల్లో దాచుకున్న అక్రమార్కుల అనుపానులు తేల్చేందుకు 'సిట్'ను ఏర్పాటు చేయడం ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ అక్రమార్కులపై తొలి బాణం సంధిస్తే, స్విస్ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనానికి సంబంధించిన ఖాతాల వివరాలను వెల్లడించేందుకు స్విట్జర్లాండ్ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయడం ఈ నెల పాలనలో ఒక గొప్ప విజయమనే చెప్పాలి. దీంతో, అడ్డగోలుగా కోట్లాదిరూపాయలు సంపాదించి, ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొట్టి, దోచుకున్న సొమ్మును ఇంతకాలం భద్రంగా దాచుకున్న అక్రమార్కుల గుండెలు గుబేల్‌మంటున్నాయి. లక్షలాది కోట్ల రూపాయలుగా వున్న ఆ నల్లధనాన్ని తిరిగి రప్పించడం ద్వారా, ఆ ధనంతో దేశంలోని ఎందరో నిరుపేదల ఆకలి తీర్చవచ్చని, దేశంలో దారిద్ర్య నిర్మూలనకు, తదితర ప్రజోపయోగకరమైన కార్యక్రమాలకు ఆ ధనాన్ని వెచ్చించవచ్చని మేధావులు, ప్రజలు అందరూ విశ్వసిస్తున్నారు. ఎంతో కాలంగా అక్రమంగా దాచుకుని వున్న నల్లధనాన్ని తిరిగి రప్పించడంలో కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న చొరవకు, అందుకు ప్రధానంగా ప్రధాని నరేంద్రమోడీ సారథ్యానికి, తెగువకు ప్రజలు సంతోషాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఇలా సరికొత్త ఆలోచనలతో.. ప్రజల ఆశలు.. ఆకాంక్షలు నెరవేర్చేందుకు తగ్గ విధానాలతో ముందడుగు వేస్తుండడం ఎంతైనా హర్షణీయం. ప్రధాని మోడీ జనరంజకమైన పాలనకు, ఆయన నిజాయితీ.. నిబద్ధతలకు ఈ తొలి నెల పాలనే ఒక మంచి ఉదాహరణ అని చెప్పవచ్చు.



## ముందడుగు

**ధరలు పెరిగిపోయి, ప్రజల్లో కొనుగోలు శక్తి బాగా సన్నగిల్లిపోయి, సామాన్యుని జీవన పరిస్థితులు సంకటంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో, శరపరంపరగా వస్తున్న అన్ని రకాల సవాళ్లను సంయమనంతో ఎదుర్కొంటూనే, ప్రగతి రథాన్ని ముందుకు కదిలించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు ప్రధాని మోడీ.**

# 'అంతర్'జాతీయం

- భారతీయ నల్లకుబేరుల జాబితాను స్విస్‌బ్యాంక్ సిద్ధం చేసింది. నల్లధనం వెలికితీతకు భారత ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు తాము సహకరిస్తామని స్విట్జర్లాండ్ అధికారి ఒకరు తెలిపారు. స్విస్ ఇచ్చిన జాబితాను తాము క్షుణ్ణంగా పరిశీలిస్తామని చట్ట విరుద్ధంగా లెక్కల్లోకి రాని ధనాన్ని అక్కడి బ్యాంకుల్లో దాచుకున్నట్లు ఋజువైతే సంబంధితులపై గట్టి చర్యలు తీసుకుంటామని 'సిట్' సారథి జస్టిస్ ఎం.బి.షా వెల్లడించారు.
- మరింత సమర్ధవంతంగా, పారదర్శకంగా సేవలందించడానికి ప్రభుత్వ కార్యాలయాలలో ఈ-పాలనపై కేంద్రం కసరత్తు చేస్తుంది. కాగితం వాడుకను తగ్గించడానికి సాంకేతికతను ఉపయోగించుకునే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.
- పాకిస్థాన్‌కు అమెరికా అందజేస్తున్న సైనిక సాయాన్ని తక్షణం నిలిపివేసేందుకు ఉద్దేశించిన ఒక బిల్లు అమెరికా ప్రతినిధుల సభలో వీగిపోయింది. మూజువాణి ఓటుతో ఈ బిల్లును తిరస్కరించారు.
- ప్రముఖ బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్ ఈ నెల 23న ప్రధానమంత్రి మోడీని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా తాను చేపట్టిన 'సత్యమేవజయతే' ద్వారా లేవనెత్తిన పలు సామాజిక అంశాలను ప్రధానితో చర్చించారు.
- హిమాచల్‌ప్రదేశ్‌లోని గ్రేట్ హిమాలయన్ జాతీయ పార్కు యునెస్కో వారసత్వ సంపద జాబితాలో చేరింది. సిమ్లాకు 250 కిలోమీటర్ల దూరంలో కులు లోయలో 940.40 చదరపు కిలోమీటర్లు విస్తరించి వున్న ఈ పార్కులో అరుదైన జంతు జీవ జాలం వుంది.
- హజ్‌యాత్రికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో గణనీయమైన మార్పులు తీసుకురానున్నట్లు భారత విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ తెలిపారు. భారత్ కోటాలో 20శాతం కోత విధిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాల్సిందిగా ఆమె సౌదీ ప్రభుత్వాన్ని కోరారు.
- ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఒత్తిడిల నేపథ్యంలో పన్ను నేరాలపై దర్యాప్తు చేపడుతున్న భారత్ వంటి దేశాలకు సాయం అందించేలా చట్టాన్ని సడలించాలని స్విట్జర్లాండ్ నిర్ణయించింది.
- కేంద్రమంత్రులు, అధికారులు చేసే విదేశీ పర్యటనలకు ప్రధాని నరేంద్ర మోడీ కళ్లెం వేసారు. తమ విదేశీ పర్యటనలపై పదిరోజుల ముందుగా ప్రధాని కార్యాలయానికి తెలపాలని, ఈ పర్యటన ద్వారా తామేమి సాధించేది వివరించాలని కేబినెట్ కార్యదర్శి అజిత్‌సేథ్ ఒక నోట్‌లో కోరారు.

# వార్త వ్యాఖ్య

| | | | |
|---|---|---|---|
| వార్త | :- | అభినవ దుర్యోధనుడు కేసీఆర్. | - మంత్రి పల్లె రఘునాథరెడ్డి. |
| **వ్యాఖ్య** | **:-** | ***ఆ పేరుకు కేసీఆర్ కటౌట్‌కు సరికాదేమో?*** | |
| వార్త | :- | పార్టీ మారేవారికి సిగ్గు లేదు. | - రఘువీరారెడ్డి. |
| **వ్యాఖ్య** | **:-** | ***అసలు రాజకీయాలకే సిగ్గు లేదు.*** | |
| వార్త | :- | రైల్వేల ఆర్థిక పరిస్థితి బాగాలేదు. | - వెంకయ్యనాయుడు. |
| **వ్యాఖ్య** | **:-** | ***దేశ ఆర్థిక పరిస్థితే బాగ లేదులే...*** | |
| వార్త | :- | రాష్ట్రపతి పదవికి తగిన వ్యక్తి అద్వానీ. | - కేంద్రమంత్రి నితిన్ గడ్కారీ. |
| **వ్యాఖ్య** | **:-** | ***తదుపరి రాష్ట్రపతిని ఇప్పుడే ప్రకటించేసారన్నమాట!*** | |
| వార్త | :- | త్వరలో గ్యాస్ ధరల పెంపు. | |
| **వ్యాఖ్య** | **:-** | ***పెంచాలనుకున్నవన్నీ ఇప్పుడే పెంచేస్తే పనిలో పని అయిపోతుందనా?*** | |
| వార్త | :- | త్వరలో నూతన మద్యం పాలసీ. | - మంత్రి రవీంద్ర. |
| **వ్యాఖ్య** | **:-** | ***ఇంటింటికి మద్యం అని మాత్రం పెట్టకండి.*** | |
| వార్త | :- | గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వండి. | - చంద్రబాబు. |
| **వ్యాఖ్య** | **:-** | ***నాణ్యమైనది ఇవ్వాలని ఇప్పుడిచ్చేది కూడా లేకుండా చేస్తారేమో?*** | |
| వార్త | :- | మోడీ సర్కార్‌కు కార్పొరేట్ల అండ. | - సీపీఐ. |
| **వ్యాఖ్య** | **:-** | ***కార్పొరేట్లేమన్నా ఐఎస్ఐ ఉగ్రవాదులా?*** | |
| వార్త | :- | హామీల వల్లే తెదేపా గెలుపు. | - అసెంబ్లీలో జగన్. |
| **వ్యాఖ్య** | **:-** | ***ఆ హామీలను వ్యతిరేకించే మీ ఓటమి.*** | |
| వార్త | :- | జల జగడంపై కేంద్రం రంగప్రవేశం. | |
| **వ్యాఖ్య** | **:-** | ***ఆంధ్ర, తెలంగాణల మధ్య తగవులు తీర్చడానికి కేంద్రం ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖను పెడితే సరి!*** | |
| వార్త | :- | మద్యం షాపులను సర్కారే నిర్వహించాలి. | - సీఎంకు సీపీఎం వినతి. |
| **వ్యాఖ్య** | **:-** | ***మద్యం అమ్ముకుని చంద్రబాబును పరిపాలన చేసుకోమంటారా?*** | |
| వార్త | :- | సాయిబాబా దేవుడు కాదు. | - ద్వారక పీఠాధిపతి వివాదాస్పద వ్యాఖ్య. |
| **వ్యాఖ్య** | **:-** | ***ఇప్పుడు దేశానికి ఈ పాయింట్ అంత అవసరమా!*** | |

# కష్టాల్లోనే మగ్గుతున్న.. మగ్గం బతుకులు

> చితికిపోతున్న చేనేత జీవితాలు



జిల్లాలోనే కాదు, రాష్ట్రంలోనూ, దేశవ్యాప్తంగా కూడా చేనేతకారుల పరిస్థితి రానురాను దయనీయంగా మారింది. ఒకప్పుట్లో చేనేతకు ఎంతో వైభవం వుండేది. చేనేత వస్త్రాలు ధరించడం ఒక మంచి సంప్రదాయంగా వుండేది. కానీ, కాలం మారింది. చేనేతకు గతంలో వున్న ఆదరణ బాగా తగ్గిపోయింది. దీంతో, చేనేత వస్త్రాలు తయారుచేసే నేతకారుల జీవనానికి గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా జిల్లాలోని వెంకటగిరి, పాటూరు, నెల్లూరు రూరల్‌లోని పలు గ్రామాల్లో వేలాది కుటుంబాలు చేనేత మీదనే జీవిస్తున్నాయి. వెంకటగిరిలో నేతకారుల నైపుణ్యం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రఖ్యాతిగాంచాయి. ఎందరో నైపుణ్యం గల చేనేతకారుల కుటుంబాలు జిల్లాలో వున్నాయి. ఎంతో కళానైపుణ్యం కలిగిన వెంకటగిరి పట్టు చీరలు, పాటూరు నేత వస్త్రాలు చేనేత రంగంలో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నాయి. అయితే, నానాటికీ నూలు ధరలు పెరిగిపోవడం, ఎంతో కష్టించి నేసిన వస్త్రాలకు ఆశించిన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో, చేనేతకారుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఎంతో ఓర్పు, నేర్పులతో, కళానైపుణ్యంతో పట్టు చీరలు నేసేవారు చివరికి పట్టెడు మెతుకులకు కూడా నోచుకోలేకపోతుండడం విచారకరం. మగ్గాన్ని నమ్ముకున్న వేలాదిమంది నేతకారులు, సరైన ఉపాధి అవకాశాలు లేక, కుటుంబాలను పోషించుకోలేక అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. నిద్ర లేచింది మొదలు, కుటుంబంలోని వారందరూ కలసి, ఇదే కుల వృత్తిగా, జీవనోపాధిగా.. కష్టపడి నేత నేస్తుంటారు. ఎన్నో రకాల రంగులు, హంగులతో నేతవస్త్రాలు రూపొందించినా వాటికి సరైన ఆదరణ లేక, మంచి ధరలు లేక డీలాపడిపోతున్నారు. రెక్కాడితే గానీ, డొక్కాడని ఆ నిరుపేద కుటుంబాలవారు నిత్యం జీవనభృతి కోసం పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఎంతోకాలం నుంచి అలవాటు పడిన ఈ వృత్తిని వదులుకోలేక, మరొక పని చేయడం చేతకాక, కుటుంబాలను పోషించేందుకు అనునిత్యం జీవనపోరాటం సాగిస్తున్నారు. వెంకటగిరి మండలంలోని బంగారుపేట తదితర గ్రామాల్లో వేలాది కుటుంబాలు నేటికీ నేతనే నమ్ముకుని వున్నాయి. అదేవిధంగా, కోవూరు మండలంలోని పాటూరు, గుమ్మళ్ళదిబ్బ తదితర ప్రాంతాల్లోనూ, నెల్లూరు రూరల్ మండలంలోని నారాయణరెడ్డిపేట, గుడిపల్లిపాడు తదితర ప్రాంతాల్లోనూ నేతకారులు జీవిస్తున్నారు. ఈ కుటుంబాల్లో అనేకమంది నిరుపేద నేతకారులు ప్రస్తుతం పూట గడవని స్థితిలో వున్నారు. ఈ నేపథ్యంలో నేతనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న మహిళల పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది. దేశంలోనే వ్యవసాయం తర్వాత, అత్యంత ప్రాధాన్యత గల రంగం చేనేతే. దేశవ్యాప్తంగా సుమారు 43లక్షల మందికి పైగానే చేనేతకారులున్నారని అంచనా. వీరిలో అత్యధిక శాతం మంది కూడు, గూడు లేక విలవిలలాడుతున్నవారే. నేత కార్మికుల జనాభా లెక్కల ప్రకారం చూసినా, దాదాపు 54.6 శాతం మంది నేతకార్మికులు సరైన ఇళ్ళు లేక, పూరిగుడిశెల్లోనే మగ్గం గుంటలు ఏర్పాటు చేసుకుని అత్యంత దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నారు. చిన్న వర్షం వచ్చినా, మగ్గం గుంటల్లో నీళ్ళు నిలబడి వారు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ఎంతో నైపుణ్యం వున్న చేనేతకారులకు అవసరమైన ప్రాథమిక వసతులు కూడా వుండడం లేదు. మంచి నైపుణ్యం కనపరిచేందుకు తగిన మంచి మగ్గాలు కూడా కరువే. ఎంతోకాలం నుంచి చేనేతకారుల జీవనపరిస్థితి దయనీయంగానే వున్నప్పటికీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు చేనేతకారులకు చేయూతనందిస్తాం అని ప్రకటించుకుంటున్నా, పలు పథకాలు ప్రవేశపెట్టినా ఆచరణలో వాటిని సక్రమంగా పర్యవేక్షించేవారు లేకపోవడంతో ఆ పథకాలు అసలైన నిరుపేద చేనేతకారులకు అందడం లేదు. భారత ప్రజల ఆశాజ్యోతిగా ప్రధాని నరేంద్రమోడి ప్రధాని అయ్యాక, ప్రజల కష్టాలు తెలిసిన నేత పదవిలోకి వచ్చాడంటూ చేనేతకారులు సంతోషపడుతున్నారు. మోడీ పాలనలోనైనా తమకు న్యాయం జరుగుతుందని, చేనేతకారుల కష్టాలు గమనించి, తమను, తమ కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటాడని ఎంతో ఆశతో వారు ఎదురు చూస్తున్నారు. మోడీ ప్రధాని అయ్యాక, దయనీయస్థితిలో వున్న చేనేతరంగాన్ని ఆదుకోవాలంటూ జాతీయ చేనేత బోర్డు పక్షాన ఆ బోర్డు సభ్యుడు కెఎవన్ మూర్తి ప్రధానికి లేఖ రాశారు కూడా. చేనేతకారుల కష్టాలను ఆయన ఆ లేఖలో వివరించారు. చేనేతకార్మికులకు కూడా జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వర్తింపజేయాలని, సాంఘికభద్రత కల్పించాలని, సహకార రంగంలో పనిచేస్తున్న ప్రతి నేతకార్మికునికి **(మిగతా 10వ పేజీలో)**


# క్యాంపులకు సెలవు... ఎన్నికలతో ఇక కొలువు

## మేయర్, ఛైర్మెన్, జడ్పీ ఛైర్మెన్, ఎంపీపీ ఎన్నికలకు పచ్చజెండా

మేయర్, మున్సిపల్ ఛైర్మెన్, జిల్లా పరిషత్ ఛైర్మెన్, ఎంపీపీల ఎన్నికకు ఎన్నికల సంఘం పచ్చజెండా ఊపింది. ఈ నెల 26న దీనికి సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసింది. జూలై 3, 4 మరియు 5వ తేదీలలో వీటికి సంబంధించిన ఎన్నికల ప్రక్రియ పూర్తికానుంది. జూలై 3వ తేదీన నగరపాలక సంస్థల్లో మేయర్, డిప్యూటీ మేయర్‌ల ఎన్నిక, పురపాలక సంఘాలలో ఛైర్మెన్, వైస్‌ఛైర్మెన్‌ల ఎన్నిక జరుగుతుంది. 4వ తేదీన మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి. 5వ తేదీన జిల్లా పరిషత్ ఛైర్మెన్, వైస్‌ఛైర్మెన్‌ల ఎన్నిక ఉంటుంది.

రాష్ట్రంలో 7కార్పొరేషన్‌లు, 92మున్సిపాల్టీలు, 13జడ్పీలు, 657మండలాలలో ఈ మూడు రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది. నెల్లూరుజిల్లా వరకు చూస్తే నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు కావలి, గూడూరు, సూళ్లూరుపేట, ఆత్మకూరు, వెంకటగిరి, నాయుడుపేట మున్సిపాల్టీలకు, నెల్లూరు జడ్పీతో పాటు 46 మండల పరిషత్‌లకు ఎన్నికల తంతు ముగుస్తుంది. స్థానికసంస్థల ఫలితాలు వెలువడిన ఒకటిన్నర నెలకు పరోక్ష పద్ధతిలో ఈ ఎన్నికలు జరుగనున్నాయి. మెజార్టీ సీట్లు పొందిన ఆయా పార్టీల వాళ్లు తమ వాళ్లను కాపాడుకోవడానికి క్యాంపుల పేరుతో ఇంతకాలం నానా తంటాలు పడ్డారు. ఎన్నికల నోటిఫికేషన్‌తో వారికి ఉపశమనం లభించి నట్లయ్యింది.

ADMISSIONS - 2014
B.E/ B.Tech
(All Branches)
Chennai Top Colleges
Konda Reddy
098416 05100 (TN)





## నెల్లూరు కబుర్లు

# జిల్లాలో అడుగుపెట్టనున్న మోడీ

భారత ప్రధాని బాధ్యతలు చేపట్టిన నెలరోజుల్లోనే నెల్లూరుజిల్లాలో అడుగుపెట్టబోతున్న తొలి ప్రధానిగా నరేంద్ర మోడీ చరిత్రకెక్కనున్నారు. గతంలో ఏ ప్రధాని కూడా పదవిలోకి రాగానే భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్‌సెంటర్‌కు వచ్చిన దాఖలాలు లేవు. కాని మోడీ మాత్రం తన హయాంలో జరుగుతున్న తొలి రాకెట్ ప్రయోగాన్ని స్వయంగా తిలకించేందుకు వస్తున్నారు. ఈ నెల 30న ఉదయం షార్ నుండి పిఎస్ఎల్వి–సి23 రాకెట్ ప్రయోగం జరుగనుంది. దీని కోసం ప్రధాని ఒకరోజు ముందే వస్తున్నారు. 29వ తేదీ మధ్యాహ్నం ఢిల్లీ నుండి బయలుదేరి 4గంటలకు చెన్నై చేరుకుంటారు. అక్కడ నుండి హెలికాప్టర్‌లో 4.45గంటలకు షార్‌కు వస్తారు. 5గంటలకు భాస్కర అతిథిగృహం చేరుకుంటారు. 5.30కి షార్ శాస్త్ర వేత్తలు, అధికారులను కలుస్తారు. 6.40కి లాంచ్‌ప్యాడ్‌ను పరిశీలిస్తారు. తిరిగి అతిథిగృహానికి వచ్చి బస చేస్తారు. 30వ తేదీ ఉదయం 9.15గంటలకు మిషన్ కంట్రోల్ రూమ్‌కు చేరుకుంటారు. 9.25నుండి 10.30గంటల వరకు శాస్త్రవేత్తలతో కలిసి రాకెట్ ప్రయోగాన్ని వీక్షిస్తారు. అనంతరం 10.50కి షార్ నుండి బయలుదేరి చెన్నై ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.



ఈ నెల 29, 30 తేదీలలో భారత ప్రధాని నరేంద్రమోడీ శ్రీహరికోట పర్యటన నేపథ్యంలో ఈ నెల 21న ప్రధాని పర్యటన ఏర్పాట్లపై షార్ డైరెక్టర్ యం.వి.యస్.ప్రసాద్‌తో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవాల్, జాయింట్‌కలెక్టర్ రేఖారాణి

## విఫలమైన బాబు ప్రయత్నం...

ప్రధాని అయ్యాక తొలిసారిగా రాష్ట్ర పర్యటనకు వస్తున్న నరేంద్ర మోడీని రేణిగుంట ఎయిర్‌పోర్టులో దించి ఆయనకు స్వాగతం పలకాలని చంద్రబాబు ఆశించారు. ఈమేరకు చెన్నై ఎయిర్‌పోర్టులో కాకుండా రేణిగుంట ఎయిర్‌పోర్టులో దిగితే మాకు గౌరవంగా ఉంటుందని చంద్రబాబు ఫోన్‌లో మోడీకి విన్నవించుకున్నారు. మోడీ కూడా ఇందుకు సరేనన్నారు. అయితే భద్రతా కారణాలతో ప్రధాని వ్యక్తిగత భద్రతా సిబ్బంది చెన్నై ఎయిర్‌పోర్టులోనే దిగాలని పట్టుబట్టింది. దీనికి మోడీ ఒప్పుకోవడంతో చంద్రబాబు ఆశ నెరవేరలేదు. కాగా మోడీ షార్ పర్యటనలో చంద్రబాబు, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడులు కూడా పాల్గొననున్నారు.

## ఇంత 'చెత్త'గా ఉందేంటి?

### --- నెల్లూరు చెత్త చూసి అదిరిపడ్డ జపాన్ బృందం ---



నెల్లూరులో ఇంటికొక మంచినీటి కొళాయి ఉండకపోవచ్చు. వీధికొక సిమెంట్‌రోడ్డు, సెంటర్‌కొక పార్కు ఉండకపోవచ్చు. కాని ప్రతి ఇంటి ముందు పేరుకు పోయిన డ్రైనేజీ, ప్రతి వీధిలో కొండలను తలపించే చెత్తదిబ్బలు, ప్రతి సెంటర్‌లో మురికి పందుల మందలు మాత్రం తప్పనిసరిగా వుంటాయి. ఈ చెత్తదిబ్బలు చూసే విశాఖ, బెంగుళూరు కారిడార్ పరిశీలనకు గాను నెల్లూరొచ్చిన జపాన్ మరియు చెన్నై అధికారులు ముక్కు మూసుకుని దానిపైన వేలేసుకున్నారు. విశాఖ టు చెన్నై, బెంగుళూరు – చెన్నై కారిడార్‌లలో నెల్లూరుకు చోటు దక్కడం తెలిసిందే. ఈ నేపథ్యంలో జపాన్‌కు చెందిన జిమాన్‌శ్యాంగ్ నేతృత్వంలో ఇద్దరు చెన్నై పరిశీలకులు ఆదివారం నెల్లూరొచ్చారు. వాళ్లు అల్లీపురం, కల్లూరుపల్లి, దొంతాలి వద్ద వున్న కార్పొరేషన్ డంపింగ్‌యార్డ్‌లను పరిశీలించారు. చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్న విధానంపై వివరాలు సేకరించారు. డంపింగ్‌యార్డ్‌లో చెత్త నిర్వహణ, చెత్తలో ఎక్కువ భాగం ప్లాస్టిక్ వస్తువులు ఉండడంపై ఈ బృందం అసంతృప్తిని వ్యక్తం చేసింది. ప్లాస్టిక్ వినియోగంపై నియంత్రణ లేకపోవడాన్ని ఈ బృందం ఎత్తిచూపింది. మన కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యంతో మన నెల్లూరోళ్ల ముందే కాదు విదేశీయుల ముందు కూడా సింహపురి చెత్తపురిగా కనిపిస్తుంది.

## బాలల హక్కులను రక్షిద్దాం




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏజేసి రాజ్‌కుమార్, పక్కన బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని అదనపు జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఆరుగురు సభ్యుల బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు సోమవారం నెల్లూరులో పర్యటించారు. బోడిగాడితోట, శిశుగృహ, బాలసదన్, క్యాప్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ బోడిగాడితోట పిల్లలు శవాలతో సహజీవనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ ప్రాంతం నుండి శ్మశానాన్ని మార్చడానికి చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు. జిల్లాలో ఎక్కడా చైల్డ్ లైన్ 1098 నెంబర్‌పై ప్రచారం లేదని, దీనిపై అవగాహన కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాలల హక్కులపై పత్రికలు, ఫోన్ల ద్వారా వచ్చిన ఫిర్యాదులను సుమోటాగా స్వీకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమీషన్ సభ్యులు రహీముద్దీన్, అచ్యుతరావు, సుమిత్ర, మురళీధరరెడ్డి, డాక్టర్ మమత రఘువీర్, బాలరాజు, ఐసిడిఎస్ పిడి విజయలక్ష్మి, వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ టి.వసంతలక్ష్మి, స్వచ్ఛంధ సంస్థల జిల్లా అధ్యక్షులు ఈవిఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ రామకృష్ణ సేవాసమితి పోటీల్లో

## ప్రథమ స్థానంలో 'రత్నం' విద్యార్థి



అభినందనలందుకుంటున్న శివకుమార్

నెల్లూరు పురమందిరంలో ఈనెల 21న శ్రీ రామకృష్ణ సేవాసమితి వార్షికోత్సవాల సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, దేశభక్తి గీతాలు, భక్తిగీతాల పోటీలలో దర్గామిట్ట సరస్వతినగర్‌లోని డా॥ కిషోర్స్‌రత్నం ఒలంపియాడ్ బ్యాచ్ విద్యార్థి పి.వి.వి.శివకుమార్ ప్రథమస్థానంలో నిలిచి బహుమతులు సాధించాడు. ఈ సందర్భంగా రత్నం స్కూలు ప్రిన్సిపాల్ కె.వి.డి.మనోజ్‌కుమార్, డైరెక్టర్స్ డా॥కృష్ణకిషోర్, వాసంతి కృష్ణకిషోర్, రత్నంస్కూలు జనరల్ మేనేజర్ రామమూర్తి నాయుడు తదితరులు ప్రతిభ చాటిన 9వతరగతి విద్యార్థి పి.వి.వి.శివకుమార్‌ను తల్లిదండ్రులను పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

## కరువు జిల్లాగా ప్రకటించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

జిల్లాలో వర్షపాతం దారుణంగా వున్న దృష్ట్యా నెల్లూరు జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డిలు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సాగునీరు, తాగునీరుకు ఇబ్బంది లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వైయస్సార్‌నగర్‌లోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అవినీతి చోటుచేసుకుందని దీనిపై విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేసారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నెల్లూరులో రెండు తహశీల్దార్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరారు.

## దీపం కనెక్షన్లు ఇవ్వండి



ఎంపిడిఓకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసులు

నెల్లూరురూరల్ మండలం పొట్టేపాలెం గ్రామంలో దీపం పథకం క్రింద ఎంపికైన లబ్ధిదారులకు వెంటనే గ్యాస్ కనెక్షన్‌లు ఇవ్వాలని కోరుతూ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి సోమవారం ఎంపిడిఓ వసుమతికి వినతిపత్రం సమర్పించారు. గ్యాస్ కనెక్షన్‌లు రాక గ్రామంలో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నికల కోడ్ కారణంగా ఇంతవరకు గ్యాస్ కనెక్షన్‌లు ఇవ్వలేదని, ఇకనైనా పంపిణీ చేయాలని ఆయన కోరారు.

## తగ్గని మంట

జూన్ నెల కూడా పోతోంది. సూర్యభగవానుడు ఏ మాత్రం కనికరించడం లేదు. జనాలపై నిప్పులవానను ఆపడం లేదు. వాతావరణం ఏ మాత్రం చల్లబడలేదు. ప్రతిరోజూ ఎండ నిప్పుల కుంపటిలా కాస్తూనే వుంది. నైరుతి ఋతుపవనాల జాడే లేదు. వర్షం మాట దేముడెరుగు, కనీసం ఆకాశం మబ్బున్నా పడితే వాతావరణం చల్లగా వుంటుంది. ఆకాశంలో మబ్బుల జాడ లేదు. జూన్ నెల దాటిపోతున్న జిల్లాలో సమ్మర్ మాత్రం కొనసాగుతూనే వుంది.

## శిక్షణ పూర్తి చేసిన ట్రైనీ జేసీ



జాయింట్ కలెక్టర్‌గా ఇంతియాజ్ అహ్మద్ ఈనెల 23న శిక్షణ సంపూర్ణమయింది. ఆయన ట్రైనీ జేసీగా నాలుగు నెలలు పూర్తికావడంతో ఈనెల 25న సిఎస్ కార్యాలయంలో రిపోర్టు చేసారు.

## పోలీసు సోదాలు

ఈ నెల 29, 30 తేదీలలో భారత ప్రధాని నరేంద్ర మోడీ షార్ సెంటర్‌కు వస్తున్న సందర్భంగా నెల్లూరు నగరంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. నెల్లూరు రైల్వేస్టేషన్, బస్టాండ్‌లు, కూడళ్లలో తనిఖీలు చేపట్టి అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. పలు లాడ్జీలలోనూ సోదాలు చేస్తున్నారు.

## టెన్త్ స్పాట్ 1 నుండి

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనం జూలై 1వ తేదీ నుండి నెల్లూరు దర్గామిట్టలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగనుంది. మొత్తం 324మంది ఉపాధ్యాయులు 27వేల పరీక్షాపత్రాలను దిద్దనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసారు.

### బ్యాడ్మింటన్ అసోసియేషన్

## ఉపాధ్యక్షుడిగా ద్వారక



ఉపాధ్యక్షుడిగా పత్రాన్ని అందుకుంటున్న ముక్కాల

ఆంధ్రప్రదేశ్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన 6వ డివిజన్ కార్పొరేటర్ ముక్కాల ద్వారకానాథ్ ఎన్నికయ్యారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్‌కు ఆదివారం హైదరాబాద్‌లో ఎన్నికలు జరుగగా ద్వారకను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

ఇప్పటివరకు ద్వారక అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు.

## దేశం వైపు...

# 'ఆకర్ష్' తులవుతున్నారు

### పార్టీ మారిన చాట్ల, జహీర్



జిల్లాలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసే దిశగా ఆ పార్టీ నాయకులు ఆపరేషన్ ఆకర్ష్‌కు శ్రీకారంచుట్టారు. జిల్లాకు చెందిన మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు తెలుగుదేశంలో చేరడానికి సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ సీనియర్ నాయకులు, నెల్లూరులో ఆనం వర్గానికి ముఖ్యుడు, నెల్లూరు నగర కాంగ్రెస్ అధ్యక్షులు చాట్ల నరసింహారావు ఈ నెల 23న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశంపార్టీలో చేరాడు. ఆయనతో పాటు మైనార్టీ నాయకుడు జకీర్‌అహ్మద్, కాపునాడు జిల్లా అధ్యక్షులు డివిఎస్ గిరి తెలుగుదేశంలో చేరారు. వీరి అనుచరులు కూడా జిల్లాలో జరిగే కార్యక్రమంలో తెలుగుదేశంలో చేరనున్నారు.

నెల్లూరు కాంగ్రెస్‌లో, ఆనం వర్గంలో మిగిలివున్న ఓ పెద్ద తలకాయ చాట్ల నరసింహారావు. వివేకా మురిపెంగా పిలుచుకునే అయ్యోరు. అయ్యోరికి సుదీర్ఘ రాజకీయ చరిత్ర వుంది. 1981లో తొలిసారి కౌన్సిలర్ అయ్యాడు. 1983లో ఆనం వారితో కలిసి తెలుగుదేశంలో చేరాడు. 1987లో మళ్ళీ కౌన్సిలర్ అయ్యాడు. 1990లో ఆనంతో కలిసి కాంగ్రెస్‌లో చేరాడు. 2000 ఎన్నికల్లో కౌన్సిలర్‌గా ఓటమి చవి చూసాడు. అయితే కో-ఆప్షన్ సభ్యుడిగా కౌన్సిల్‌హాల్లో అడుగుపెట్టారు. 2005లో నెల్లూరు నగరపాలక సంస్థలో కార్పొరేటర్‌గా ఎన్నికయ్యాడు. ఆ సంవత్సరమే నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. 2010 నుండి మొన్నటి ఎన్నికల ముందు దాకా ఇన్‌ఛార్జ్ డీసీసీ అధ్యక్షబాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర విభజనతో రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ఎత్తిపోవడంతో ఇక ఆ పార్టీలో ఉండడం దండగనుకున్న చాట్ల ఆనంతో అనుబంధాన్ని తెంపుకుని తెలుగుదేశంలో చేరిపోయారు.

# నిధుల కొరతతో నీరసం

- చతికిలపడుతున్న గ్రంథాలయాలు
- వసూలు కాని రూ. 4 కోట్ల సెస్సు బకాయిలు



జిల్లాలో గ్రంథాలయాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా తయారైంది. ఎంతో మంది పాఠకులకు, విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలు నిధుల లేమితో నీరసపడిపోతున్నాయి. ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి అవసరమైన నిధులను అందించకపోవడం, మరోవైపు గ్రంథాలయాల సెస్సు బకాయిలు కోట్ల రూపాయలకు చేరుతున్నా, ఆ బకాయిలు మాత్రం వసూలు కాకపోతుండడంతో గ్రంథాలయాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేకపోతున్నాయి. జిల్లాలోని 46 మండలాల్లో గ్రంథాలయాలు వున్నాయి. వాటికి ఆయా ప్రాంతాల్లోని గ్రామపంచాయతీలు, పురపాలక సంఘాల నుంచి సెస్సు రూపేణా నిధులు అందించాల్సివుంది. అయితే, ఎంతోకాలంగా సెస్సు బకాయిలు వసూలు కాకపోవడంతో, ఆ బకాయిలు దాదాపు నాలుగు కోట్ల రూపాయల దాకా పెరిగిపోయాయి. పంచాయతీలు, పురపాలక సంఘాల వారి నుంచి సెస్సు బకాయిలు వసూలు చేయడం అంత సులభమేమీ కాదు. ఇక ఇలా ఎంతకాలమని ఆ బకాయిల కోసం ఎదురు చూస్తూ గడపాలో తెలియడం లేదని గ్రంథాలయాల పాలకులు ఆవేదన చెందుతున్నారు. అసలే గ్రంథాలయాల స్థితి అంతంతమాత్రంగానే వుంది. భవనాల కొరత, గదుల కొరత, చాలీచాలని వసతులతో, సిబ్బంది కొరతతో గ్రంథాలయాల నిర్వహణ చాలా కష్టంగా వుంటోంది. నిత్యం గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు కానీ, విద్యార్థులకు కానీ అనేక గ్రంథాలయాల్లో కనీస సౌకర్యాలు కూడా వుండడం లేదు. కొత్త పుస్తకాలు కొనుగోలు చేయాలన్నా, గ్రంథాలయాలను బాగు చేసుకోవాలన్నా నిధులు కావాలి. అటు ప్రభుత్వం నుంచి నిధులు రాక, ఇటు సెస్సులు వసూలు కాక.. పాఠకులతో కళకళలాడాల్సిన గ్రంథాలయాలు రోజురోజుకీ నీరసంతో వెలవెలబోతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా గ్రంథాలయాల బాగుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సివుంది. సెస్సు వసూళ్ళకు ఖచ్చితమైన, నిర్దిష్టమైన విధానాలు రూపొందించాలి. అవసరమైతే చట్టాన్ని సవరించైనా గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతిఏటా నిధులు కేటాయించాలి. అప్పుడే గ్రంథాలయాలు తిరిగి చదువుల తల్లి నిలయాలుగా.. విజ్ఞాన భాండాగారాలుగా కళకళలాడుతాయి.

- లక్కుతోనే ముడిపడ్డ కిక్కు

సింహపురి సమాచారం

# పాతసీసాలోనే కొత్త సారా

రాష్ట్ర ప్రభుత్వం పాత పద్ధతిలోనే మద్యంషాపుల కేటాయింపుకు శ్రీకారం చుట్టింది. 2014 -15 సంవత్సరానికి కొత్త ఎక్సైజ్ పాలసీని ప్రభుత్వం ఈ నెల 23న ప్రకటించింది. లాటరీ ప్రక్రియ ద్వారా బ్రాందీషాపులు కేటాయించనున్నారు. ఈమేరకు జిల్లాలో 348వైన్ షాపుల కేటాయింపుకు నోటిఫికేషన్ జారీ చేసారు. జిల్లాలో నెల్లూరు, గూడూరు ఎక్సైజ్ జిల్లాలున్నాయి. వీరి పరిధిలో 348 మద్యం దుకాణాలున్నాయి. అలాగే జిల్లాలో 28బార్లు ఉండగా వాటికి రెన్యువల్ చేసుకునే అవకాశం కల్పించారు.

ఈసారి మద్యం దుకాణాల లైసెన్స్ ఫీజుల్లో స్వల్ప మార్పులు చేసారు. 10వేల వరకు జనాభా ఉన్న గ్రామంలో లైసెన్స్ ఫీజు 32.50లక్షలు, 10వేల నుండి 50వేల వరకు జనాభా వున్న పట్టణంలో 36లక్షలు, 50వేల నుండి 3లక్షల దాకా జనాభా ఉన్న పట్టణాలలో 45లక్షలు, 3 నుండి 5లక్షల దాకా జనాభా వున్న నగరాలలో 50లక్షలు, 5లక్షలు దాటిన నగరాలలో 64లక్షలుగా లైసెన్స్ ఫీజును నిర్ణయించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం నెల్లూరు నగర జనాభా 5.50లక్షలుగా వుండడంతో నెల్లూరులో వున్న 32మద్యం దుకాణాలకు 64 లక్షల స్లాబు వర్తిస్తుంది.



మద్యం షాపులకు సంబంధించి ఈ నెల 24 నుండి దరఖాస్తుల స్వీకరణ మొదలుపెట్టారు. ఈ నెల 27 వరకు దరఖాస్తులు తీసుకుంటారు. 28వ తేదీ కస్తూర్భాకళాక్షేత్రంలో లక్కీడిప్ ద్వారా మద్యం దుకాణాలను కేటాయిస్తారు.

అయితే కొత్త ఎక్సైజ్ పాలసీ మద్యం వ్యాపారులకు అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. గత కొన్నేళ్లుగా బెల్టు షాపుల వల్ల నష్టాలు రాకుండా నెట్టుకుంటూ వచ్చారు. అదీగాక ఈ సంవత్సరం అన్ని రకాల ఎన్నికలు రావడంతో మద్యం వ్యాపారులు కొంతవరకు ఒడ్డునపడ్డారు. అయితే ఇక ఐదేళ్ల దాకా ఎన్నికలు లేవు. దీనికితోడు ప్రభుత్వం బెల్టుషాపులను రద్దు చేసింది. అయితే ప్రతి వైన్‌షాపుకు అనుబంధంగా పర్మిట్‌రూమ్‌కు అనుమతిచ్చారు. ఇవి అనధికార బార్‌లే అనుకోవచ్చు. అలాగే ప్రతి కొనుగోలు మీద కంప్యూటర్ బిల్లు ఇవ్వాలని చెప్పారు. ఇది మద్యం వ్యాపారులకు కొంతవరకు ఇబ్బందే! ఆయా ముఖ్యప్రాంతాలలో మద్యం దుకాణాలను దక్కించుకోవడానికి వ్యాపారులు సిండికేట్‌లు కట్టారు. ఒక్కో సిండికేట్ నుండి వివిధ పేర్లతో పెద్దఎత్తున దరఖాస్తులు చేసారు. అయితే కొన్ని షాపులకు మాత్రం పెద్దగా డిమాండ్ లేకపోవడం విశేషం.

# వాత్సల్యకు వదాన్యుల చేయూత

- రూ. 1.15లక్షలతో విద్యార్థులకు పుస్తకాలు
- బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ దాతృత్వం



నెల్లూరులోని జనహిత-వాత్సల్య ఆధ్వర్యంలో నడుస్తున్న వాత్సల్య నిరాధార బాలబాలికలకు నెల్లూరు జిల్లా బులియన్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ వారు చేయూతను అందించారు. అక్కడున్న బాలబాలికలు నిరుపేదలు, కొందరు అనాథలు అయినప్పటికీ బాగా చదువుకుని విద్యలో రాణిస్తుండడం పట్ల అసోసియేషన్‌వారు విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేశారు. అంతేకాదు, వాత్సల్యలో 1 నుంచి 10వ తరగతి దాకా చదువుకుంటున్న 110 మంది విద్యార్థుల కోసం లక్షా పదిహేను వేల రూపాయలు వెచ్చించి, ఆ చిన్నారులందరికీ అవసరమైన పుస్తకాలను పంపిణీ చేసి తమ వదాన్యతను చాటుకున్నారు. ఈ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఈ నెల 22వ తేదీన జరిగింది. ఈ సందర్భంగా బులియన్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ శాశ్వత అధ్యక్షులు శాంతిలాల్‌జైన్ మాట్లాడుతూ నిరాధార బాలబాలికలకు తమ అసోసియేషన్ తరపున ఈ సాయం అందించడం తమకెంతో సంతృప్తిని, సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. ఇక్కడి చిన్నారులు ఎంతో శ్రద్ధతో, క్రమశిక్షణతో చదువుకుంటున్నారని, అలాంటి వారికి సాయం అందించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న బొల్లినేని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కార్డియాలజీ విభాగం చీఫ్ డాక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని, సేవా కార్యక్రమాలతో సమాజానికి మనవంతు సేవ చేయాలని అన్నారు. వాత్సల్యలోని నిరాధార బాలబాలికలకు చేయూతనందించడం ఎంతో సంతోషదాయకమని అంటూ, ఆ చిన్నారులంతా మరింత బాగా చదువుకుని ఉన్నతస్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

రెడ్‌క్రాస్ కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ మాట్లాడుతూ చిన్నారులందరూ ఆత్మవిశ్వాసంతో, పట్టుదల వీడకుండా బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంకా బులియన్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శి జెవెల్ సత్యం, సహ కోశాధికారి ఎ.సుబ్రహ్మణ్యం, జనహిత-వాత్సల్య గౌరవాధ్యక్షులు సామంతు గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.జయప్రకాష్, వాత్సల్య సంఘటనాకార్యదర్శి జివి సాంబశివరావు, ఇసి మెంబర్ బివిఎస్ బాబు, హెడ్‌మాస్టర్ మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొని వాత్సల్య చిన్నారులకు పుస్తకాలు అందజేసి, వారికి తమ ఆశీస్సులు అందజేశారు.


**N.B.K.R.**
INSTITUTE OF SCIENCE & TECHNOLOGY
(AUTONOMOUS)
Established 1979
Affiliated to JNTUA
Vidyanagar, SPSR Nellore Dt. www.nbkrist.org

**I B.TECH. ADMISSIONS - 2014**

మా కళాశాలలో కన్వీనర్ కౌన్సిలింగ్ ద్వారా లేదా మేనేజ్‌మెంట్ సీటు పొందిన విద్యార్థులకు తమవంతు సామాజిక సేవా భావంతో క్రింది విధంగా ఫీజు నిర్ధారించడమైనది.

| EAMCET ర్యాంకు | ఫీజు |
|---|---|
| 1 - 10000 | రూ. 35,000/- |
| 10001 - 20000 | రూ. 45,000/- |

సూళ్లూరుపేట / నాయుడుపేట / గూడూరు / నెల్లూరు పట్టణముల నుండి కాలేజి బస్సు సౌకర్యం కలదు.

వివరాలకు : Dr.C. Raveendra Reddy
Cell No : 94415 72755

Dr.I. Gopal Reddy, Former V.C., JNTU, Chairman
Nedurumalli Ram Kumar, Correspondent
Dr. V. Vijaya Kumar Reddy, Director

శ్రీను గల్పిక

# దరిద్రం కొట్టీ అధికారం

అది సీమాంధ్రులను నిర్దాక్షిణ్యంగా తరిమివేయబడ్డ హైదరాబాద్ నగరం. లోటస్ పాండ్‌లోని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నివాసం. ఆరోజు అసెంబ్లీలో సభ్యుల ప్రమాణస్వీకారం. జగన్‌తో కలిసి అసెంబ్లీకి పోవాలని ఎమ్మెల్యేలు అందరూ అక్కడకు వచ్చారు. వై.వి.సుబ్బారెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డిలు కూడా అప్పుడే అక్కడకు చేరుకున్నారు. అప్పుడే విజయమ్మ అక్కడకు వచ్చింది. అందరినీ ఆప్యాయంగా పలకరించి కూర్చోమని కాఫీ అందించింది. వై.వి.సుబ్బారెడ్డి ఉండి... జగన్ బాబు రెడీ అయితే ఆయనతో పాటూ అందరూ అసెంబ్లీకి వెళతారన్నాడు. అందుకు విజయలక్ష్మి... జగన్ ఇంకా నిద్ర లేచినట్లు లేదు... పార్టీ అధికారంలోకి రాలేదు, తనను నమ్ముకున్న వాళ్ల చాలామంది నష్టపోయారనే బాధతో జగన్ డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయాడు. రెండ్రోజుల నుండి సరిగా తిండి కూడా తినడం లేదు. తన గదిలో వేసుకున్న తలుపును తీయడం లేదని చెప్పింది. అప్పుడు సుబ్బారెడ్డి... ఓస్ ఈ మాత్రం దానికేనా... ఇలాగైతే రాజన్న ఓ ఇరవైఏళ్లు బెడ్‌రూంలో నుండి బయటకొచ్చి ఉండకూడదు. ఏది జరిగినా మన మంచికే అనుకోవాలా... ఉందిలే మంచికాలం ముందుముందునా అనుకుంటూ ఆశగా జీవించాలి. ఆయన డిప్రెషన్‌లోకి వెళితే ఇక పార్టీ గతేంకాను అని అన్నాడు. అప్పుడే వాయిస్ ఆఫ్ నెల్లూరు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కలుగజేసుకుని... విజయక్కా... ఇప్పుడు ఓడిపోయినందుకు మనం సంతోషపడాలి. గెలిచినందుకు చంద్రబాబు బాధ పడాలి. అని చెప్పాడు. ఆ లాజిక్ ఏంటని అందరూ కోటంరెడ్డి వైపు ప్రశ్నార్థకంగా చూసారు. బయట చప్పుడు కావడంతో బెడ్‌రూం తలుపులు తెరచుకుని జగన్ బయటకు వచ్చాడు. ఏం జరుగుతుందని ఆయన అడిగాడు. సుబ్బారెడ్డి ఉండి... పార్టీ ఓడిపోయిందని మీరు డిప్రెషన్‌లో వున్నారట కదా... మన శ్రీధరేమో ఈ సమయంలో పార్టీ ఓడిపోయినందుకు పండుగచేసుకోవాలంటున్నాడు. గెలిచినందుకు చంద్రబాబు కుమిలిపోతున్నాడట... ఆ లాజిక్ ఏంటో మాకు అర్థం కావడం లేదన్నాడు. జగన్ కూడా కోటంరెడ్డిని అదే సందేహం అడిగాడు. వెంటనే కోటంరెడ్డి తన ఫ్యాంట్ జేబులో నుండి ఒక సిడి తీసాడు. అక్కడే వున్న కంప్యూటర్‌లో పెట్టి ఆన్ చేసాడు. అందరూ ఆ కంప్యూటర్ స్క్రీన్ వైపు చూస్తున్నారు.

**మొదటి సీన్...**

అది హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసం. ఆయన టి.వి. 9-9-9 ఛానెల్‌లో వార్తలు చూస్తున్నాడు. ఆంక్షలతో ఋణమాఫీ చేస్తామన్న కేసీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ దిష్టిబొమ్మలను తగలేస్తున్నారు. ఆ దృశ్యాలను చూస్తూ చంద్రబాబు వణకసాగాడు. అప్పుడే భువనేశ్వరీదేవి వచ్చింది... ఆయన వణకడం చూసి... ఏంటండి, ఏదో హర్రర్ సినిమా చూస్తున్నట్లు అలా వణికిపోతున్నారు. మీరు చూస్తున్నది వార్తలే కదా అని అంది. దానికి చంద్రబాబు... ఈ వార్తలే హర్రర్ సినిమా కంటే భయంకరంగా వున్నాయి. నరం లేని నాలుక ఓట్ల కోసం ఎన్నికల్లో ఏదేదో మాట్లాడేసింది. ఋణమాఫీ చేస్తానని చెప్పి ఓట్లేయించుకున్నాను. ఇప్పుడు జనాలంతా అప్పులు రద్దయిపోయాయి కదా అని కొత్త అప్పు కోసం బ్యాంకులకు పోతున్నారు. ఋణమాఫీ చేయాలంటే 83వేల కోట్లు కావాలి. మొదలే మన స్టేట్ పరిస్థితి సాయిబాబా గుడి ముందు బెగ్గర్‌లా వుంది. ఋణమాఫీ చేయకుంటే మాత్రం రేపట్నుండి నా దిష్టిబొమ్మలు తగలబెట్టేటట్లున్నారని భయపడుతూ చెప్పాడు.

★★★★★

**సెకండ్ సీన్..**

కేసీఆర్ దయాదాక్షిణ్యాలతో కేటాయించిన క్యాంప్ ఆఫీసులో చంద్రబాబు కూర్చున్నాడు. అక్కడ కూర్చున్న మాటేగాని ఆయన మనసంతా ఋణమాఫీ చుట్టూనే తిరుగుతుంది. ఈ గండాన్ని ఎలా తప్పించుకోవాలనుకుంటూ, ప్రధాని నరేంద్ర మోడీ సాయం కోరితే బాగుంటుందనుకున్నాడు. వెంటనే మోడీకి ఫోన్ చేసాడు.

చంద్రబాబు : మోడీ సాబ్, నేను చంద్రబాబును.

**మోడీ :** చంద్రబాబు సాబ్, బాగున్నారా, మీ రాష్ట్రం ఎలా వుంది.

చంద్రబాబు : మీరే ఎన్నికల ప్రచారంలో చెప్పారు కదా, బిడ్డను తీసి తల్లిని చంపారని, అలాగే వుంది.

**మోడీ :** ఇంకేం సంగతులు.

చంద్రబాబు : మా రాష్ట్రంలో అన్నదాతలు అధ్వాన్న స్థితిలో ఉన్నారు. ఋణమాఫీ అమలు చేయాలి. మీరే ఎలాగైనా సాయం చేయాలి.

**మోడీ :** హలో... హలో... హలో... వెధవది ఈ లైన్‌లు బాగుండి చావవు... అంటూ ఫోన్ కట్ చేసాడు. చంద్రబాబుకు సీన్ అర్థమైపోయింది.

★★★★★

**మూడో సీన్...**

ఢిల్లీలోని రిజర్వ్‌బ్యాంకు కార్యాలయం. బ్యాంకు గవర్నర్ రాజన్ తన ఛాంబర్‌లో ఉన్నారు. అంతలో ప్యూన్ వచ్చి... సార్, మిమ్మల్ని కలవాలని ఆంధ్ర సీఎం చంద్రబాబుగారొచ్చారు అని చెప్పాడు. దానికి రాజన్ అదిరిపడి... నేనున్నట్లు చెప్పావా అని అడిగాడు. చెప్పాను సార్, అని ప్యూన్ అన్నాడు. నా ఖర్మ, ఏం చేద్దాం, లోపలకు పంపించు అని చెప్పాడు. ప్యూన్ వచ్చి చెప్పడంతో చంద్రబాబు లోపలకు వెళ్లాడు. రాజన్ ఆయనను గౌరవంగా ఆహ్వానించి... సార్, కాఫీ తీసుకుంటారా? అని అడిగాడు. లేదు ఋణమాఫీ తీసుకుంటాను అని చంద్రబాబు చెప్పాడు. దానికి రాజన్... కాఫీ ఇచ్చినంత సులభంగా ఋణమాఫీ ఇవ్వలేం సార్, మీరు ఋణాలు మాఫీ చేయాలంటే మాకు డబ్బులు కట్టాల్సిందే అని చెప్పాడు. అసలు మొగుడే ఉంటే అద్దెమొగుడుతో పనేముంది... కట్టే స్తోమతే ఉంటే మీతో మాకు పనేంటంటూ చంద్రబాబు అక్కడ్నుండి కోపంగా లేచాడు.

★★★★★

**నాలుగోసీన్...**

ఢిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు కార్యాలయం. చంద్రబాబు నేరుగా వెళ్లి ఆయనను కలిసారు. రాష్ట్ర రాజధాని నిర్మాణంపై ఆయనతో చర్చ మొదలుపెట్టాడు. చంద్రబాబు మాట్లాడుతూ సింగపూర్ లెవల్లో రాజధానిని నిర్మించాలనుకుంటున్నాను. నలభై, యాభై అంతస్థుల బిల్డింగ్స్ కడతాం, మొత్తం భూగర్భ రైల్వే లైన్ నిర్మిస్తాము... మెట్రో రైల్, మెట్రో ఏసి బస్సులు తిప్పుతాము. ప్రతి ఆఫీసుకు ఏ.సి ఉంటుంది. ప్రతి కార్యాలయానికి అందమైన వెలెవేషన్ ఉంటుంది. ప్రతి రహదారిని నాలుగులైన్ల నుండి 8లైన్ల దాకా అభివృద్ధి చేస్తాం.. మీరు రాజధానిలో అడుగుపెడితే సింగపూర్‌లో దిగామేమో అనుకోవాలని అన్నాడు. దానికి వెంకయ్య... భేష్, మీ ప్లాన్ చాలా బాగుంది. మీరు ఇంత బాగా చేస్తామంటే మాకు అంతకంటే ఏం కావాలన్నాడు. అందుకు చంద్రబాబు... మాకు మీ సహకారం కావాలన్నాడు. వెంటనే వెంకయ్య... ఏం కావాలో చెప్పండి. మట్టి ఎత్తడానికి మనుషులను పంపమంటారా... మా నెల్లూరు నుండి ఇటుకలను పంపమంటారా... అని అడిగాడు. ఏమీ వద్దు... రాజధాని నిర్మాణానికి నాలుగు లక్షల కోట్లివ్వండి అని చంద్రబాబు అడిగాడు. ఆ మాటకు వెంకయ్యకు కళ్లు తిరిగినంత పనైంది. తర్వాత తమాయించుకుని... ఒకసారి మీరు చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు వెళ్లిరండి... మీకు పరిస్థితి అర్థమవుతుంది. 4లక్షల కోట్లు మీకివ్వాలంటే ఇక మాఫియాతో మేము కూడా కుమ్మక్కై మీకు నకిలీ కరెన్సీని పంపాల్సిందే... మనకేం సింగపూర్ లాంటి బిల్డింగ్‌లు అవసరం లేదు... తాటాకు వసారాలు, రేకులషెడ్లు వేసుకుని ముందు సీమాంధ్ర నుండే పనులు చేసుకోండి, సింగపూర్ గురించి తర్వాత ఆలోచిద్దురు అని హితబోధ చేసాడు. చంద్రబాబు అక్కడ నుండి నిరుత్సాహంగా లేచి బయటకొచ్చి... నా ఖర్మ కాలి ఇప్పుడు సీఎంనయ్యానంటూ అక్కడే వున్న స్థంభంకేసి తల బాదుకోసాగాడు.

★★★★★

ఇక్కడితో సిడిలో దృశ్యాలు ఆగిపోయాయి. అప్పుడు కోటంరెడ్డి.. చూసారా, కాలం కాని కాలంలో చంద్రబాబు సీఎం అయ్యి ఎంతగా మానసిక క్షోభపడుతున్నాడో, దేవుడు అతని పక్క కాదు, మనపక్క వున్నాడు. అందుకే రాళ్లు వేయించుకునే పనిని అతనికిచ్చి, రాళ్లు వేసే బాధ్యతను మనకప్పగించాడు. ఈ ఐదేళ్లు మనకు చేతినిండా రాళ్లు పట్టుకుని విసరడమే పని అని చెప్పాడు. చంద్రబాబు అగచాట్లు చూసిన జగన్ హుషారుగా అసెంబ్లీకి బయల్దేరాడు.

కదంబం

## ప్రవహించే ప్రశ్న

- డా॥ బీరం సుందరరావు
ఇంకొల్లు. 98480 39080.

ప్రవహించడమే కవిత్వమైతే
ప్రతి నదీ, ప్రతి వాగూ
ప్రతి మనిషీ కవే!
కరగని మనసుకు
కదలని మనిషికి కవిత్వమెందుకు?
ఓనమాలు రాకుండానే
ఓంకార నాదం ఆలపించినట్లు
ఆనవాలు తెలియకుండానే
అక్షరాలు పేరుస్తూ, సభల్లో అరుస్తూ
ప్రవహించే మురుగును కవిత్వమంటుంటే
నన్ను నేను ధ్వసించుకుంటాను.

చూడాలేగాని, కవిత్వం కానిదేముంది?
రాయాలేగాని, వాక్యం కానిదేముంది?
విత్తనాలు చల్లి, పంట కోసం కలలుకనే
రైతుకు మించిన కవి ఎవడున్నాడు?
విత్తనమై మొలకెత్తి, రంగులపూలై విప్పారి
చేయెత్తి పిలిచే చెట్టుకు మించిన
కవితావస్తువేముంది?
లోకంలో సుమగంధాన్ని
సుందర పదబంధాన్ని ఆస్వాదించే
సరికొత్త సీతాకోకచిలుకల్ని ఆహ్వానించు
నవనవోన్మేషంగా వాక్యమై ప్రవహించు
ప్రశ్నించడమే నవత్వం!
ప్రవహించడమే కవిత్వం!!

సంపూర్ణమైన...

## గురువాయూర్ మహావిష్ణువు బ్రహ్మోత్సవాలు



నెల్లూరు వేదాయపాలెంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత గురువాయూర్ మహావిష్ణువు బ్రహ్మోత్సవాలు ఈనెల 22న సంపూర్ణమయ్యాయి. అహోబిలం మఠం ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నరసింహాచార్యులు, మాధవాచార్యులు విశేషరీతిలో పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ శోభాయమానంగా జరిపారు. ఉభయకర్తలుగా దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, మస్తానమ్మ, పి.టి.రంగరాజన్, అలివేలు, కత్తి మోహన్‌రావు, విజయలక్ష్మి, బట్టేపాటి శ్రీనివాసులు, స్నేహలత, పి.టి.వాసు, కమలమ్మ, దేవళ్ళ శ్రీధర్‌రెడ్డి, సుప్రజలు వ్యవహరించారు. కార్యక్రమాలను స్వామి అయ్యప్ప సేవా సమాజ అధ్యక్షులు పి.టి.రంగరాజన్, కార్యదర్శి శేషగిరిరావు, సభ్యులు చలపతిస్వామి, శంకరన్‌లు పర్యవేక్షించారు. కనకదుర్గ గోపాలకృష్ణ, విశాలఖ్యాతిసాగర్, విక్రమసాగర్ తదితరులు అన్నప్రసాద పంపిణీ చేశారు.

## నర్రవాడలో పరిశోధనా గ్రంథావిష్కరణ



ఇటీవల నర్రవాడ పంచాయితీ కార్యాలయంలో "నర్రవాడ వెంగమాంబ తిరునాళ్ళు-జానపద కళల ప్రదర్శన" అనే పరిశోధనాగ్రంథాన్ని సర్పంచ్ మేకపాటి మాలకొండరాయుడు ఆవిష్కరించారు. నెల్లూరు జిల్లాలో ప్రతి ఏటా విశేషంగా జరిగే నర్రవాడ వెంగమాంబ తిరునాళ్ళలో ప్రదర్శించే జానపద కళలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. ఆత్మకూరు మండలం మురుగళ్ళ గ్రామానికి చెందిన కనియంపాటి రామకృష్ణ హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, జానపద కళలశాఖ అధిపతి ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ అంశంపై పరిశోధనచేసి యం.ఫిల్ పట్టా పొందారు. నర్రవాడ వెంగమాంబ తిరునాళ్ళ సందర్భంగా ఈ పరిశోధనా గ్రంథాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మచ్చా కృష్ణయ్య, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఎన్.నారాయణ, నర్రవాడ వెంగమాంబ దేవస్థాన మాజీ వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మల రంగయ్యచౌదరి, విశ్వజ్ఞాచారి తదితరులు పాల్గొన్నారు.

## రాశి - మీ వాసి



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 27.06.2014 నుండి
తేది. 03.07.2014 వరకు

ఈవారం మేషంలో కేతువు, వృషభంలో శుక్రుడు, మిధునంలో రవిబుధులు, కర్కాటకంలో గురువు, కన్యలో కుజుడు, తులలో శనిరాహువులు, మిధునకర్కాటక సింహరాశులలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగము: జూన్ 27 శుక్రవారము మధ్యాహ్నము నుండి మిధున ఆషాడమాస ప్రారంభము. శూన్యమాసము.

**ముహుర్తము:**
ముహూర్తములు లేవు.

### ఆషాఢ మాస తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 27 | శుక్ర | జ్యేష్ఠకృష్ణఅమావాస్య | ప॥గం.12.18వ॥ |
| తేది. 28 | శని | ఆషాడశుక్లపాఢ్యమి | ప॥గం.1.40వ॥ |
| తేది. 29 | ఆది | విదియ | సా॥గం.3.25వ॥ |
| తేది. 30 | సోమ | తదియ | సా॥గం.5.22వ॥ |
| తేది. 01 | మంగళ | చతుర్ధి | రా॥గం.7.22వ॥ |
| తేది. 02 | బుధ | పంచమి | రా॥గం.9.17వ॥ |
| తేది. 03 | గురు | షష్ఠి | రా॥గం.10.56వ॥ |

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారాలలో ఆదాయ వ్యయాలను సమీక్షించుకుంటూ అభివృద్ధి ప్రయత్నాలు చేస్తారు. ఆదాయముకంటే ఖర్చులు అదనంగా ఉండి అవసరాలకు ఋణాలు చేస్తారు. పనులు నిదానంగా జరుగుతూ టెన్షన్ పెడతాయి. ఆర్థిక విషయాలలోగాని, ఇతర విషయాలలోగాని నిర్ణయాలు చేయగలిగిన ధైర్యం ఉండదు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఆర్థికంగా బాగుండి ఆదాయం పెరుగుతుంది. ఇంట్లో ప్రశాంతత నెలకొంటుంది. సోదరులకు వారి కుటుంబానికి మేలు జరుగుతుంది. వాయిదాపడిన పనులు కొనసాగుతాయి. అధికారుల వల్ల ఉద్యోగులకు ఆదరణ, పనిభారం పెరుగుతుంది. ప్రభుత్వ అనుమతులు బ్యాంకు ఋణాలు మంజూరుకాగలవు. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలు లభించగలవు.

### మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వృత్తి వ్యాపారాలలో వ్యాపకం బాగుంటుంది. ఆదాయం తృప్తికరంగా ఉండినా కుటుంబ ఖర్చులు, ఇతర ఖర్చులు పెరుగుతాయి. గృహవస్తువాహనముల రిపేర్లు ఏర్పడతాయి. సమాజ అభివృద్ధి ప్రయత్నాలకు సహాయపడతారు. శుభకార్య ప్రయత్నాలలో విరామం ఏర్పడుతుంది. రావలసిన బాకీలు అందుతాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, స్థానచలనములు ఉండవచ్చును.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి జీవనము కలవారికి ఆర్థికముగా బాగుంటుంది. వ్యవసాయదారులు, ఫలసాయదారులకు సేద్యం ఆశాజనకంగా ఉంటుంది. వ్యాపార వర్గాలకు పోటీతో పాటు అవకాశాలు చేజారవచ్చును. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. కోర్టు కేసులు కొంత ఇబ్బంది పెడతాయి. అవసరాలకు ఋణాలు చేయవలసి వస్తుంది. కుటుంబసభ్యులతో అనుకూలత తక్కువ.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి ఉద్యోగ బాధ్యతలను శ్రద్ధగా నిర్వహించండి. అధికారులకు ప్రభుత్వమునకు వివరణలివ్వడం నోటీసులు అందుకొనడం ఉద్యోగులకు ఇబ్బంది కలిగించవచ్చును. వ్యాపారవర్గాలకు మంచి ఆర్థికావకాశాలు దొరకడం, ఆదాయం పెరగడం ఉంటుంది. వృత్తిపరంగా సంతృప్తి ఉంటుంది. చేసే పనులపై శ్రద్ధ తగ్గుతుంది. మాటలు, ప్రవర్తనను అదుపులో ఉంచుకొనాలి.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగులకు అధికారుల వద్ద మంచి గుర్తింపు, ముఖ్య అదనపు బాధ్యతలుపైనబడటం, ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకడం జరుగుతుంది. ఆర్థిక విషయాలపై శ్రద్ధ చూపెడతారు. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా ఉండి ఆదాయము పెరుగుతుంది. శుభవార్తలు వింటారు. ఉత్సాహంగా పనులు పూర్తిచేస్తారు. వ్యవహారాలలో విజయం లభిస్తుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆలోచనలు, ఆశయాలు మెల్లగా కార్యరూపానికి రాగలవు. నూతన పెట్టుబడులకు, వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు అందుతాయి. అవసరాలకు డబ్బు సర్దుబాటై పనిగడిచిపోతుంది. వ్యవసాయ రంగాల వారికి ఆశాజనకంగా ఉంటుంది. వ్యాపారవర్గాలకు ఆదాయము తృప్తికరము. ఇంట్లో ఆత్మీయులకు అనారోగ్య బాధలుంటాయి. గృహవస్తు, వాహన రిపేర్లుంటాయి.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వ్యాపారవర్గాలకు అభివృద్ధి అవకాశాలు చేజారిపోవచ్చును. స్థిరాస్తుల క్రయవిక్రయాలు వాయిదావేయండి. వృత్తి వ్యాపారాలలో ఆశించిన ఆదాయం ఉండదు. కొత్త పరిశ్రమలకు, కొత్త వ్యాపారాలకు అనుమతులు లభించగలవు. ఉద్యోగులకు బాధ్యతలు మారడం, స్థాన చలనం ఉండగలదు. బంధువర్గంతో విభేదాలు కలుగ వచ్చును. ఆరోగ్యం స్వల్పంగా ఇబ్బంది పెడుతుంది.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆవేశాలు పట్టుదలను తగ్గించి పరిస్థితులకు సర్దుబాటు చేసుకొనవలసి ఉంటుంది. అగ్రిమెంట్స్, ఆర్థిక లావాదేవీలందు జాగ్రత్తపడండి. ప్రభుత్వ అనుమతులు బ్యాంకు ఋణాలు లభించగలవు. బిడ్డల వివాహ ప్రయత్నాలు, ఉన్నత విద్యాప్రయత్నాలలో ఆందోళన ఉంటుంది. అవసరాలకు డబ్బు సర్దుబాటు చేస్తారు. ముఖ్యపత్రాలు, నోటీసులు అందుకొంటారు.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

అనుకున్న కార్యక్రమాలు, పనులు ఆశించిన విధంగా జరగవు. వ్యాపారవర్గాలలో స్తబ్ధత ఏర్పడి ఆదాయం తగ్గవచ్చు. వృత్తి వ్యవసాయాలు ఆశావహంగా సాగుతాయి. అయితే సమస్యలను పరిష్కరించే తెలివితేటలు బాగుంటాయి. ప్రజాజీవితంలో మీ సూచనలు సలహాలు ఆమోదయోగ్యం. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. విద్యార్థులకు విద్యావకాశాలు బాగుంటాయి.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థిక విషయాలలోగాని, కుటుంబ విషయాలలోగాని తొందరపాటు నిర్ణయాలు చేయవద్దు. స్థిరాస్తుల కొనుగోలు విషయంలో పేచీలు రావచ్చును. వృత్తి, వ్యాపారవర్గాలకు ఆర్థికంగా అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. కాని కుటుంబఖర్చులు, సేవాకార్యక్రమాలకు సహాయపడటం వల్ల ఖర్చులు అదనంగా ఉంటాయి. అవసరాలకు ఋణం చేసినా చేయవచ్చు.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి వ్యాపారాలలో ఆర్థికస్థితి బాగుండి ఆదాయము బాగుంటుంది. రావలసిన బాకీలు లభించగలవు. పనులకు ఆటంకాలు జరుగుతూ కొనసాగిస్తారు. యజమానులకు వర్కర్ల సమస్యలుండగలవు. అనుకోని అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉండగలవు. ఆత్మీయులను అధికారులను కలుసుకొంటారు. నూతన వస్తువులు, ఆభరణాలు సమకూర్చుకొంటారు.

---

**ఎన్.టి.ఆర్.ట్రస్ట్ భవన్‌లో**

## క్రిస్టియన్ ఫెడరేషన్ వేడుకలు



ఆల్‌ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ 18వ వార్షికోత్సవం సందర్భంగా జూన్ 21 శనివారం ఉదయం హైదరాబాద్‌లోని ఎన్.టి.ఆర్. ట్రస్ట్ భవన్‌లో క్రిస్టియన్ ఫెడరేషన్ 18వవార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నికైన నారా చంద్రబాబునాయుడును ఫెడరేషన్ నాయకులు కలిసి అభినందనలు తెలియజేసారు. ఈ వార్షికోత్సవ వేడుకలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 13జిల్లాలలోని నాయకులు పాల్గొని క్రైస్తవ సమస్యలపై వినతిపత్రం అందజేసారు. అందులో భాగంగా నెల్లూరుజిల్లా క్రైస్తవులకు సమాధుల తోటకొరకు రెండెకరాల స్థలము మరియు క్రైస్తవులకు అన్ని వసతులతో కూడిన కమ్యూనిటీ హాల్ కావాలని కోరడం జరిగింది. పై రెండు విషయాలను త్వరలో పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇవ్వడం జరిగింది. కార్య క్రమంలో ఆల్‌ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ నెల్లూరుజిల్లా అధ్యక్షులు ఉరుందూరు సురేంద్రబాబు, రెవ.డా॥రాజశేఖర్ దాసరి, పాస్టర్ సామ్యూల్‌శేఖర్, ఎ.ప్రసాద్ పాల్గొన్నారు.

## పెంచిన ఛార్జీలను ఉపసంహరించుకోవాలి


నెల్లూరులోని వెల్ఫేర్ పార్టీ కార్యాలయంలో ఈనెల 22న కార్యకర్తల సమావేశం జరిగింది. ఇందులో ముఖ్యంగా రైల్వే, రవాణా చార్జీలు అనే దానిపై చర్చ జరిగింది. వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు అబ్దుల్ సమీ ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం రైల్వే, రవాణా చార్జీలు పెంచడం, ప్రజలపై భారం మోపడం పట్ల ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కానుండగా చార్జీలు పెంచడాన్ని దీని ద్వారా అన్ని ధరలు పెరిగి ప్రజలపై పెనుభారం పడుతుందని చెప్పారు. పెంచిన రైల్వే రవాణా చార్జీలు తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు.

ఎన్నికల ముందు ప్రధాని మోడీ మంచి రోజులు వస్తున్నాయని చెప్పారంటే ఇదేనేమో, ఈరోజు రైల్వే అన్నారు రేపు పెట్రోలు, గ్యాస్ చార్జీలను కూడా పెంచుతూపోతారు. కావున పెంచిన రైల్వే, రవాణా చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు.




కార్యక్రమంలో సిటీ ప్రెసిడెంట్ ఇలియాజ్‌ఖాన్, ఇర్ఫాన్, రియాజ్‌ఖాన్, సందాని, ముజీబ్, అమీర్, నవీద్ నగర మహిళా అధ్యక్షురాలు అయిషాకౌసర్ తదితరులు పాల్గొన్నారు.

## బంద్‌లను నిషేధించండి!



యం.ఐ.యం జిల్లా అధ్యక్షులు మహమ్మద్ రవూఫ్ మరియు నాయకులు, విద్యార్థులు కలిసి బంద్‌లు, స్ట్రైకులు జరగకుండా కఠినంగా నిషేదించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ఈనెల 20న వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మహమ్మద్ రవూఫ్ మాట్లాడుతూ గత సంవత్సరం రాష్ట్ర విభజన సందర్భంగా ప్రతి ఒక్కరూ విద్యార్థులతో ఆటలాడుకొన్నారని వారి జీవితా లను నాశనం చేశారని, చీటికి మాటికి బంద్‌లు, స్ట్రైకులు జరగకుండా ఈ సంవత్సరమన్నా విద్యార్థుల చదువులు సజావుగా సాగేలా చూడాలని, పిల్లల భవిష్యత్తును దృష్టిలో వుంచుకొని ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కోరారు. విద్యార్థులను స్ట్రైకులని, బందులని పాఠశాలలు, కళాశాలలు మూయించకుండా యాజమాన్యం కూడా విద్యార్థులను కట్టుదిట్టం చేయాలని, విద్యార్థులకు ఉన్నత స్థానం, ఉజ్వల భవిష్యత్తు కోసం అందరూ పాటుపడాలని ఈ సందర్భంగా కోరారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేసి కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి హమీద్ హుస్సేన్, అన్వర్, ముస్లిం యూత్ అధ్యక్షులు షేక్ ఖాలీద్, వసీం అహమద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వావిళ్ల ఘటనలపై సరైన విచారణ జరపాలి

**పందిళ్లపల్లి అరుణమ్మ**

విడవలూరు మండలం వావిళ్లగ్రామంలో ఇటీవల జరిగిన అత్యాచారయత్నం ఘటనపై సంబంధిత పోలీసులు సరైన విచారణ జరపాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు పందిళ్ళపల్లి అరుణమ్మ డిమాండ్ చేసారు. ప్రధాన నిందితుడైన బండ్ల వేణుగోపాల్ తన కేసును నీరుగార్చేందుకు తన ఇంగ్లీషు మీడియం స్కూలును తానే ధ్వంసం చేసుకొని ఇతరులపై అభియోగాలు మోపడానికి ప్రయత్నాలు చేస్తున్నాడని దీనిపై పోలీసులు నిష్పక్షపాత విచారణ జరపాలని, 14మంది వావిళ్ల గ్రామస్తులపై తప్పుడు కేసులు బనాయించిన వేణుగోపాల్ చేస్తున్న కుట్రను పోలీసులు ఛేదించాలని ఆమె పేర్కొన్నారు. నిందితుడైన బండ్ల వేణుగోపాల్‌ను అరెస్టుచేసి కోర్టుకు పెట్టడంతోనే పోలీసుల బాధ్యత తీరిపోలేదు, వావిళ్లగ్రామంలో తలెత్తే పరిస్థితులు శాంతిభద్రతలపై కూడా పోలీసులు దృష్టి పెట్టాల్సి ఉందని, మానవమృగాడుగా మారి మహిళల పట్ల కామపిశాచియైన వేణుగోపాల్ గత కిరాతక చరిత్రను కూడా లోతుగా దర్యాప్తు చేయాల్సి వుందన్నారు. వేణుగోపాల్ చేతిలో గతంలో అనేక విధాలుగా బలై అవమానాలు పొంది బైటకు చెప్పుకోలేక నిస్సహాయస్థితిలో ఉన్న మహిళలకు న్యాయం జరగాలని వావిళ్ల గ్రామస్తులపై వేణుగోపాల్ స్కూలు యాజమాన్యం పెట్టిన తప్పుడు కేసును పరిగణనలోకి తీసుకోరాదని పేర్కొన్నారు.

# కళ్యాణ వైభవం...!



ఏ.పి. టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ ఆరంబాకం చంద్రశేఖర్ - నళిని ల కుమార్తె **రమ్యకృష్ణ - అనిరుధ్** (నెల్లూరు వాస్తవ్యులు అమ్మూరు సుబ్రహ్మణి - రాజేశ్వరిల కుమారుడు)ల వివాహం ఈ నెల 22న సి.పి.ఆర్ కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. వివాహ వేడుకలో ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కూడా పాల్గొని దంపతులను దీవించారు. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.



నెల్లూరు వాస్తవ్యులు యేడెం వెంకటరంగారెడ్డి - ఇంద్రసేనల కుమార్తె **డా॥ పూజ్య - డా॥ సమీర్‌కుమార్‌రెడ్డి** (నెల్లూరు వాస్తవ్యులు చెరుకూరు సురేంద్రరెడ్డి - శిరీషల తనయుడు)ల కల్యాణం ఈ నెల 8న నెల్లూరులోని షిర్డ్స్ ఫంక్షన్ హాలులో ఘనంగా జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభాకాంక్షలు.

# పెంచిన ఛార్జీలపై ధ్వజమెత్తిన కాంగ్రెస్



ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఉంటుందా, ఉన్నా కార్యక్రమాలు నిర్వహిస్తుందా అని అందరూ సందేహిస్తున్న తరుణంలో మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఆ సందేహాన్ని తీర్చారు. కేంద్రప్రభుత్వం రైలు ఛార్జీలను భారీగా పెంచడాన్ని నిరశిస్తూ ఆనం వివేకా ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరు రైల్వే స్టేషన్‌లో ధర్నా చేప ట్టారు. ఈ సందర్భంగా వివేకా మాట్లాడుతూ పెంచిన రైల్వేఛార్జీలపై కాంగ్రెస్‌పార్టీ దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించిన మోడీ ఈరోజు అధికారంలోకి రాగానే అదే ప్రజలకు నరకం ఎలా వుంటుందో చూపిస్తున్నారని విమర్శించారు. గుజరాత్ తరహాలో దేశాన్ని అభివృద్ధి చేస్తానన్న మోడీ అధికారంలోకి వచ్చిన నెలలోనే ప్రజలపై 8వేల కోట్ల భారం మోపారన్నారు. గతంలో యూపిఏ ప్రభుత్వం 4శాతం ఛార్జీలు పెంచితేనే బీజేపీ పెద్ద రాద్ధాంతం చేసిందని, ఇప్పుడు 14శాతం ఛార్జీలు ఎలా పెంచుతారని ప్రశ్నించారు. ప్రజలపై గ్యాస్, పెట్రోల్ భారం మోపేందుకు కూడా కేంద్రం సిద్ధమవుతుందని, ప్రజలు దీనిని ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు కొడవలూరు ధనుంజయరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, పిండి సురేష్, ఆనం చెంచుసుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జేసీస్ సేవా వితరణ



దీపక్ నెహార్‌ను సత్కరిస్తున్న జేసీస్ సభ్యులు

ఈ నెల 24న జేసీఐ-నెల్లూరుటౌన్ వారు తమ సంస్థ జాతీయ అధ్యక్షుడు దీపక్ నెహార్ నెల్లూరు పర్యటన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జేసీస్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జివిఆర్‌ఆర్ కాలేజీకి చెందిన 600మంది విద్యార్థినీవిద్యార్థులకు లాంగ్‌నోట్‌బుక్స్ అందజేశారు. అలాగే విశ్వజననీ బాలసదన్ ఆశ్రమంకు బీరువాను, పప్పులవీధిలోని సత్రంబడిలో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, పుస్తకాలు అందించారు. 50 కుటుంబాలకు దోమతెరలను వితరణ చేసారు. ఆత్మకూరు బస్టాండ్‌లో ప్రయాణీకుల సౌకర్యార్థం ఒక సిమెంట్ బెంచ్‌ని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో జేసీస్ అధ్యక్షులు చలువాది శరణ్‌కుమార్, కార్యదర్శి పి.ఇ.మురళీకృష్ణ, కోశాధికారి మహేష్‌బాబు, జనార్ధన్, శ్రీనివాసులు, ఉమారాణి, కె.సత్యం, జి.వి.సురేష్‌కుమార్, ప్రమోద్, కన్నయ్య, మధు, పాండు తదితరులు పాల్గొన్నారు.

# స్పీడందుకోని సీఎం

(మొదటిపేజీ తరువాయి)

కూడా పదేపదే ఋణమాఫీ ఎప్పుడంటూ నిలదీస్తుంది. ఋణమాఫీ పై ఏదో ఒకటి తేల్చందే పరిపాలనపై చంద్రబాబు ముందడుగు వేయలేని పరిస్థితి నెలకొంది.

పరిపాలన ఎక్కడ నుండి కొనసాగించాలనేదానిపై కూడా ఆయనలో క్లారిటీ లేదు. మూడ్రోజులు హైదరాబాద్ నుండి, మూడ్రోజులు విజయవాడ నుండి అంటున్నాడు. సీమాంధ్ర అభివృద్ధికి ఇది ఏ మాత్రం దోహదం కాదు. తెలంగాణ రాష్ట్రం మీద కూడా అధికార యావ వున్న చంద్రబాబు హైదరాబాద్‌ను పూర్తిగా వదలడానికి ఇష్టపడడం లేదు. అలావుంటే కుదరదు. కేసీఆర్ పూర్తి తెలంగాణ పక్షపాతిగా ఉన్నాడు. రాష్ట్ర విభజనతో సీమాంధ్ర అన్ని విధాలా నష్టపోయింది. దీనిని కొంత గాడిలో పెట్టాలంటే చంద్రబాబు కూడా పక్షపాత ధోరణితో వ్యవహరించక తప్పదు. కేసీఆర్‌లా దూకుడు చూపాలి. సీమాంధ్ర అభివృద్ధికి కసితో పనిచేయాలి. చంద్రబాబులో ఆ కసి, పట్టుదల ఉంటే మిగతా మంత్రుల్లోనూ ఆ స్ఫూర్తి వస్తుంది. విజయవాడలోనో, గుంటూరులోనో, మంగళగిరిలోనో... ఎక్కడో చోట రేకుల షెడ్లు, తాటాకు గుడెసెలు వేసుకునైనా పరిపాలన మొదలుపెట్టాలి. తెలంగాణ, హైదరాబాద్ ఇక మనది కాదు అనుకుని చంద్రబాబు పూర్తిగా సీమాంధ్ర అభివృద్ధికి అంకితం కావాలి. సీమాంధ్రలోనే 24గంటలూ వుంటూ తన పనితీరులో వేగం పెంచాలి.

# మగ్గం బతుకులు

(5వ పేజీ తరువాయి)

గిట్టుబాటు ధర కల్పించాలని, చేనేతరంగంలో తయారయ్యే వస్త్రాలను ప్రభుత్వం, వాటి అనుబంధ సంస్థలు కొనుగోలు చేసేట్టు చూడాలని, నాణ్యతను బట్టి వస్త్ర సేకరణ ధర, కనీస వేతనాలను ప్రభుత్వం నిర్ణ యిస్తే బావుంటుందని, రాష్ట్ర స్థాయిలో హ్యాండ్లూమ్ బోర్డ్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ఆ లేఖలో సూచించారు. చేనేతకారులకు పెన్షన్ సౌకర్యం, చేనేతకారుల కుటుంబాల్లోని గర్భిణులకు నెలకు వెయ్యి రూపాయల వంతున ఆర్థిక సాయం అందించాలని ఆయన కోరారు. ఏదేమైనా, అందరి కష్టాలూ తెలిసిన మోడీ ప్రధాని అయ్యారు కనుక, చేనేతలకు మంచి భవిత వుంటుందని వారంతా ఆశతో వున్నారు. చేనేతకారుల కుటుంబాలను ఆదుకునేందుకు, వారి జీవన పరిస్థితులను మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకుంటాయని వారంతా ఎదురుచూస్తున్నారు.

# రావణకాష్టం

(మొదటిపేజీ తరువాయి)

గత మార్చిలోనే నిర్ణయించుకున్నప్పటికీ, విభజన తర్వాత ఆ ఫైల్ కెసిఆర్‌కు వెళ్ళడం, తాగునీటి పేరుతో సాగునీటికి కూడా ఆ నీటిని ఉపయోగించుకుంటారని ఆయన భావించి, ఆ ఫైల్‌ను పెండింగ్‌లో పెట్టడంతో వివాదం ముదిరింది. దీంతో కేంద్ర జలసంఘం రంగంలోకి దిగింది. అన్ని విషయాలూ పరిశీలించాక కృష్ణా డెల్టా పరిధిలోని తాగునీటి అవసరాలకు రోజుకు ఆరువేల క్యూసెక్కుల వంతున విడుదల చేయాలని కేంద్ర జలసంఘం ఛైర్మెన్ ఆదేశించడంతో ఎట్టకేలకు ఈ వివాదం ఒక కొలిక్కి వచ్చింది. ఆ ఇచ్చే నీటిని సాగునీటికి వాడకుండా తాగునీటికే వినియోగించాలని, దానిని పర్యవేక్షించేందుకు ఒక స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఇలా తాగునీటికీ, సాగునీటికీ కొలతలు, కోతలూ పెట్టే పరిస్థితి దాపురించింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో నూతన ఆంధ్ర ప్రదేశ్‌కు నీటి కష్టాలు ప్రారంభమైనట్లే. ఒకవైపు నైరుతి రుతుపవనాలు వస్తాయని రైతులంతా ఎదురుచూస్తున్నప్పటికీ, ఈ నెల 8వ తేదీ నాటికే రావాల్సిన రుతుపవనాలు ఇప్పటికీ రాకపోగా, ఎండలు మాత్రం భగ్గుమంటూ మంటల్లా విజృంభిస్తూనే వున్నాయి. ఏరువాక ప్రారంభమైనా వాన చినుకుల జాడ మాత్రం కానరావడం లేదు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే కరువును వూహించుకుని రైతులు, ప్రజలంతా తీవ్ర ఆందోళనలో వున్నారు. ఇకపోతే, రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లోనూ నీటి నిల్వలు అంతంత మాత్రంగానే వున్నాయి. చెరువులు, దొరువుల్లో నీరు అడుగంటిపోయింది. అనేక ప్రాంతాల్లో రైతులు ఈ వ్యవసాయ సీజన్‌లో సేద్యానికి సమాయత్తమై వున్నా నీటి వనరులు మాత్రం కనుచూపు దూరంలో కూడా కనిపించడం లేదు. తొలి నుంచి నదీజలాలు, జలాశయాల పరిరక్షణ విషయంలో ముందు చూపు లేకపోవడం వల్ల కూడా ఇప్పుడు మరింత కష్టాలు ఎదురవుతున్నాయి. ప్రతి వాన చినుకునూ సద్వినియోగం చేసుకుంటే తప్ప భవిష్యత్తులో నీటి కొరతను ఎదుర్కోలేం.

వర్షాభావమో, ఎల్‌నినో ప్రభావమో ఏదైతేనేం..ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో ఇప్పుడు చుక్క వాన చినుకు లేదు. ఈ సీజన్‌లో ఇప్పటిదాకా కనీసం 57 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి వుండగా, ఒక్క సెంటీమీటర్ వర్షపాతం కూడా నమోదు కాలేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా వుందో తేటతెల్లమవుతుంది. పలు జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితి నెలకొంది. దీంతో, దాదాపు 41.72 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేసుకుందామన్న లక్ష్యం ఎలా సాధించగలమన్నది ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్రంలో ఇప్పటికే ఈ సీజన్‌లో పది శాతం వ్యవసాయ భూముల్లో సాగు చేపట్టివుండాలి కాని, అందులో సగ భాగం కూడా సాగుకు సిద్ధం కాలేదు. నాగార్జున సాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్, తుంగభద్ర డ్యామ్‌లతో పాటు జిల్లాలోని ప్రధాన రిజర్వాయర్లయిన సోమశిల, కండలేరు డ్యామ్‌లలో కూడా నీరు డెడ్‌స్టోరేజీకి చేరుకున్నాయి. ఇలా కరువు మేఘాలు కమ్ముకొస్తున్న నేపథ్యంలో, రాష్ట్రప్రభుత్వం ఇక ఆ దేవుడే దిక్కంటూ వరుణుడి కరుణ కోసం యాగాలు ప్రారంభించింది.

గత యూపిఏ మిగిల్చిపోయిన సమస్యల్ని ఎన్డీఏ ప్రభుత్వమైనా పరిష్కరించి ఈ రెండు రాష్ట్రాల మధ్య సమన్వయం నెలకొల్పాల్సివుంది.

# జగన్

(మొదటిపేజీ తరువాయి)

అక్రమాస్తుల కేసులు, గతంలో నిర్ణయాల గురించి మాట్లాడారేగాని సరైన సమాధానం చెప్పలేకపోయారు. అసెంబ్లీలో తొలి ప్రసంగమే చేస్తున్నా జగన్ ఏ మాత్రం తడుముకోలేదు. ప్రతి అంశంపైన సంపూర్ణ వివరాలతో మాట్లాడారు. సభలో ప్రతిపక్షం తరపున జగనే అంతా తానై వ్యవహరించి ఆరంభంలోనే అధికార పక్షానికి హెచ్చరికలు పంపాడు.

# గూడూరు డివిజన్ వార్తలు

"నెల్‌క్యాస్ట్" ఆధ్వర్యంలో...

## విద్యార్థులకు బ్యాగులు, నోటుపుస్తకాలు పంపిణీ




కార్యక్రమంలో మాట్లాడుతున్న యు.ఎల్.లెబోరరి ఆడిటర్ జానకిరామన్ ప్రక్కన ఆడిటర్లు పరమేశ్వరన్, శంకరనారాయణన్ మరియు నెల్‌క్యాస్ట్ మేనేజ్‌మెంట్

గూడూరు నెల్‌క్యాస్ట్ కంపెనీ మేనేజ్‌మెంట్ వారు గూడూరు మండలంలోని చవటపాలెం జిల్లా పరిషత్ హైస్కూలుకు, ప్రైమరీ స్కూలు, దీవిపాలెం స్కూలుకు 1వతరగతి నుండి 10వతరగతి వరకు సుమారు 700మంది విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు, జామింట్రీ బాక్సులు, పలకలు, ప్లేటు, గ్లాసులు యు.ఎల్.లెబోరరి ఆడిటర్లు పరమేశ్వరన్, శంకరనారాయణన్, జానకిరామన్ ముఖ్య అతిథులుగా విచ్చేసి పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చవటపాలెం స్కూలు 5సంవత్సరాలలో మంచి గుర్తింపు పొందాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నెల్‌క్యాస్ట్ కంపెనీ జనరల్ మేనేజర్ అడ్మినిస్ట్రేషన్ ఎన్.సుదర్శనరెడ్డి, ఫైనాన్స్ జనరల్ మేనేజర్ దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఆనిమెళ్ళ శికుమార్, అసిస్టెంట్ మేనేజర్ (హెచ్.ఆర్) ఎన్.శ్రీనివాసమూర్తి, వేల్పుల శ్రీనివాసులు, చవటపాలెం హైస్కూలు హెడ్మాస్టర్ ముప్పాల పురంధర్‌రాజు, ప్రైమరీస్కూలు హెచ్.ఎమ్ కె.మోహన్‌రాం, షేక్ బాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చేశెట్టి వారి వివాహం



మాజీ నెల్లటూరు సర్పంచ్ కీ॥శే॥చేశెట్టి రమేష్‌బాబు(సీవీజీ పైప్స్, గూడూరు), మాజీ మున్సిపల్ కౌన్సిలర్ శ్రీమతి జమునారాణి దంపతుల జ్యేష్ఠ పుత్రుడు **పవన్‌కుమార్-ప్రియాంక**ల వివాహం ఈనెల 22వతేదీన హైదరాబాద్ అతిథి ఫంక్షన్‌హాలు ఏ/సిలో అత్యంత వైభవంగా జరిగినది. గూడూరు సిఆర్‌రెడ్డి కళ్యాణమండపంలో ఈనెల 23వతేదీ రిసెప్షన్ జరిగినది. ఈ కార్యక్రమానికి మాజీ నెల్లూరు తెలుగుదేశం ఎం.పి.ఉక్కాల రాజేశ్వరమ్మ, వైకాపా నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, తెలుగుదేశం ఛైర్‌పర్సన్ అభ్యర్థిని పొనకా దేవసేన, మాజీ ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, కోడూరు మీరారెడ్డి, గూడూరు మున్సిపల్ కౌన్సిలర్లు, తెలుగుదేశం నాయకులు పొనకా శివకుమార్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, రాజకీయనాయకులు, భారీగా హాజరైనారు.

## సమస్యలు పరిష్కరించాలి

గూడూరు డివిజన్ పరిధిలో వున్న సమస్యలను పరిష్కరించాలని బాధితులు ఆర్డీవో శ్రీనివాసరావుకు వినతులు సమర్పించారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహించారు. గ్రామీణ మండలంలోని పగడాలపల్లిలో ఉన్న నందిగుంట చెరువుని 15ఎకరాల వరకు ఆక్రమించి భూస్వాములు విక్రయాలు చేస్తున్నారని మండల భాజపా అధ్యక్షుడు సంజీవనాయుడు ఆధ్వర్యాన ఆ గ్రామస్తులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. అలాగే మిట్టాత్మకూరు చెరువు నుంచి కొంతమంది గ్రామస్తులు మెట్ట పొలాలకు ఆయిల్ ఇంజన్లు, విద్యుత్తు మోటార్ల సాయంతో సాగునీటిని తోడేస్తున్నారని వివరించారు. విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా సైదాపురం మండలంలోని చాగణం, చాగణం రాజుపాలెం, తుమ్మలతలుపూరు గ్రామాల్లో భూమిలేని నిరుపేదలను గుర్తించి భూములు పంపిణీ చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తంచేశారు.

అరవ వెంకటమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో...

## పేద విద్యార్థులకు సామాగ్రి పంపిణీ



పేద విద్యార్థులకు సామాగ్రిని పంపిణీచేస్తున్న ఆర్డీవో శ్రీనివాసరావు

గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అరవ వెంకటమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు గురువారం ఆర్డీవో శ్రీనివాసరావు చేతుల మీదుగా సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహకారం అందిపుచ్చుకొని ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్టీ ప్రతినిధులు అరవ పార్వతయ్య, అరవ శ్రీనివాసులు, సుందరరావు, మురళీకృష్ణ, మాలమహానాడు నాయకుడు దాసరి కృష్ణ, తెలుగు గంగ ఏఈ బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

## విష్ణుమాయా విలాసము గ్రంథం ఆవిష్కరణ



శ్రీ విష్ణు మాయా విలాసము అను గ్రంథాన్ని యరగుడిపాటి వంశస్తులయిన వెంకటాచలం పంతులు రచించిన కావ్యాన్ని టిటిడి జేఇఓ పోలాభాస్కర్ ఐఏఎస్ వారి చేతులమీదుగా రవీంద్ర భారతీ, హైదరాబాద్‌లో యరగుడిపాటి చలపతిరావు గవర్నమెంటు ప్లీడర్ అధ్యక్షతన ఈనెల 22వతేదీన పుస్తక ఆవిష్కరణ జరిగినది.

ఈ కార్యక్రమంలో కార్యదర్శి వై.భరద్వాజ, డా॥రంగాచార్య, ఆచార్య చింతకుంట్ల సుబ్బారావు పాల్గొన్నారు.

గూడూరు నరసింహారావుపేటలో

## శ్రీ గురుసాయి మందిరం విగ్రహ ప్రతిష్ఠ



షిరిడి సాయినాథుని నూతన విగ్రహం



1940లో ప్రతిష్ఠించిన సాయినాథుని విగ్రహం

గూడూరు నరసింహారావుపేటలో అనాథగా వెలసి వున్న శ్రీ షిరిడిసాయిబాబా మందిరం పునర్నిర్మాణ కార్యక్రమం ఈనెల 22వతేదీ ఆదివారంనాడు అత్యంత వైభవంగా జరిగినది. బ్రహ్మశ్రీ శ్రీ మాచవోలు రాజశేఖరంశాస్త్రి ఆధ్వర్యంలో శ్రీ గట్టిస్వామి చేతులు మీదుగా సాయిబాబా మూర్తిని ప్రతిష్టించడం జరిగినది. ఈ సందర్భంగా సుమారు 5000మందిదాకా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు భక్తులు స్వీకరించారు. 1940లో ప్రతిష్ఠించిన శ్రీసాయినాథుని విగ్రహం, 2002లో ప్రతిష్ఠించిన సాయినాథ దత్తాత్రేయ మూర్తులు విగ్రహం తిరిగి ప్రతిష్ఠించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ గురుసాయి మందిరం కమిటీవారు, మరియు దాతలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యపై అవగాహన సదస్సు

### గూడూరు డిఎస్పీ

గూడూరులోని ఆసుపత్రిరోడ్డు, గడియార స్తంభం ముత్యాలపేట ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండటంతో వాహనాలు నిలుపుకొనేందుకు తెల్లరంగు లైన్ వేస్తున్నట్లు డిఎస్పీ కె.చౌడేశ్వరి తెలిపారు. గడియారపుస్తంభం వద్ద లైన్ వేసే ప్రాంతం ఎంత వరకు అన్న విషయంపై పోలీసులతో చర్చించారు. పండ్ల వ్యాపారులు కూడా ఆ గీతదాటి వ్యాపారాలు చేయకూడదని తెలిపారు. ఆమె వెంట ఎస్‌ఐలు బాబీ, అజయ్‌కుమార్ తదితరులున్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో...

## చిన్నారులకు అక్షరాభ్యాసం



చిన్నారిచే అక్షరాభాస్యం చేయిస్తున్న అర్చకులు

గూడూరు పట్టణంలోని రాజావీధిలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం చిన్నారులకు అక్షరాభాస్యం ఆలయ అర్చకులు భార్గవాచార్యులు చేత చేయించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఈవో తాతాశ్రీనివాసరావు, టెంపుల్ సిబ్బంది అన్నంరెడ్డి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి న్యూస్

## నవ్యాంధ్ర అభివృద్ధే బీజేపీ లక్ష్యం




13జిల్లాలతో కూడిన నవ్యాంధ్ర ప్రదేశ్ అభివృద్ధే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ అధికార ప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం శ్రీకాళహస్తిలోని పంచాయితీ రాజ్ అతిథి గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ని గుజరాత్ తరహాలో అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుతో కలిసి ప్రణాళికలు సిద్ధంచేశామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషిచేయడంవల్లే కేంద్రంలో బీజేపీ ఘనవిజయం సాధించిందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.ఉమా, కిసాన్‌మోర్చా కార్యదర్శి వి.మనోహర్‌రెడ్డి, గరికపాటి రమేష్‌బాబు, క్రిష్ణమనాయుడు, మోహన్‌రావు, సుకుమార్ పాల్గొన్నారు.

## కొన్ని సౌకర్యాలు కావాలంటే...

# కొంత భారం తప్పదు

- తప్పనిసరి పరిస్థితుల్లోనే రైల్వే ఛార్జీల పెంపు



కొన్ని సౌకర్యాలు కావాలంటే కొంత భారం భరించక తప్పదు. ఆరోగ్యం బావుండాలంటే చేదుమాత్రయినా మింగక తప్పదు. రైల్వే ఛార్జీల పెంపు విషయంలో ఇలాంటి చర్చలే అంతటా వినిపిస్తున్నాయి. ఈ ఛార్జీలు ప్రజలపై అదనపు భారం మోపడమేనన్న విమర్శలూ లేకపోలేదు. అయితే అసలే దేశంలో అస్తవ్యస్తంగా వున్న ఆర్ధికరంగాన్ని తిరిగి సంస్కరణలతో ఒక కొలిక్కి తేవాలన్న దృఢ సంకల్పం వున్న కొత్త ప్రభుత్వానికి రైల్వేఛార్జీల పెంపు కొంత ఇబ్బంది కలిగించే విషయమే అయినప్పటికీ, తప్పనిసరి పరిస్థితుల్లోనే ఛార్జీలు పెంచేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

అందులోనూ, ఈ నిర్ణయం కూడా ఇప్పుడు తీసుకున్నది కాదు, గత ప్రభుత్వంలోనే నిర్ణయించినది. ఇక అనివార్యమైన పరిస్థితుల్లో దానిని అమలుకు కొత్త ప్రభుత్వం సంసిద్ధమైనట్లు భావించవచ్చు. ఒక వైపు దేశవ్యాప్తంగా రైలు ప్రయాణీకులకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సి వుంది. దీనికి ప్రథమ ప్రాధాన్యతను ఇస్తూ, ప్రయాణీకులకు సౌకర్యాలు మెరుగుపరచాల్సివుంది. సురక్షితమైన..సౌకర్యవంతమైన ప్రయాణానికి బాటలు వేయాల్సివుంది. అందులోనూ ఇటీవలి కాలంలో రైళ్ళకు సరైన భద్రత లేకపోవడం, ప్రమాదాల సంఖ్య పెరుగు తుండడం, రైళ్ళలో చోరీలు అధికం కావడం, అనేక రైల్వేస్టేషన్లలో మెరుగైన వసతులు లేకపోతుండడం, ఇవే కాక రైల్వేకి సంబంధించి అనేకమైన పెండింగ్ పనులను పూర్తిచేయాల్సి వుండడం, సరికొత్త పథకాల అమలుకు మార్గం వేయాల్సివుండడం.. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలోని కొత్త ప్రభుత్వం ఆ మేరకు రైల్వే ఛార్జీల పెంపునకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రానురాను నిత్యావసర వస్తువులతో పాటు, అన్నిటి ధరలూ గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో, అటు ధరలను నియంత్రించేందుకు తగు చర్యలు తీసుకుంటూనే, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కొంత వ్యయభారమైనప్పటికీ ఛార్జీలను పెంచాల్సివస్తోంది. కొత్త రైళ్ళ నిర్మాణం కోసం, రైల్వే లైన్ల నిర్మాణం, రైల్వే స్టేషన్ల ఆధునీకరణ.. ఇలా ఏ పని చేయాలన్నా కోట్లాది రూపాయలు వ్యయం తప్పదు. ఈ పరిస్థితుల్లో ప్రయాణీకులకు సరైన వసతుల కోసం, మరింత మెరుగైన ప్రయాణం కోసం ప్రభుత్వం పెద్ద కసరత్తే చేయాల్సివుంటోంది. అందుకు తగ్గ ఆర్ధిక వసతిని ఏర్పాటు చేసుకోవాల్సి వుంటుంది. కనుక, ఈ పరిస్థితుల్లో ఆ మేరకు భారం తప్పడం లేదు. అనేకదేశాల్లో శరవేగంగా విస్తరిస్తున్న రైల్వేలను గమనిస్తే, కళ్లు చెదిరే అభివృద్ధి కనిపిస్తుంది. అత్యంత వేగంతో బుల్లెట్ రైళ్ళతో పాటు, అత్యంత భద్రత, సురక్షిత ప్రయాణం వంటి వాటిని గమనిస్తే... మనం ఇంకా ఎక్కడున్నామా?.. అనిపిస్తుంటుంది. అన్ని రంగాలు సమగ్రాభివృద్ధిని సాధించినప్పుడే అలాంటి ప్రగతి సాధ్యమవుతుంది. చితికిపోయిన ఆర్ధికస్థితి నుంచి, కష్టనష్టాల నుంచి బయటపడి, మళ్ళీ మన దేశంలో ప్రగతి ఫలాలను పండించాలంటే ఎంతో కష్టసాధ్యం. ఈ పరిస్థితుల్లో చేయాల్సిన అభివృద్ధి కోసం అక్కడక్కడా వ్యయ భారం అనివార్యమనే అనిపిస్తుంది. ఇదేవిషయమై, కేంద్ర మంత్రి వెంకయ్యానాయుడు రైల్వే ఛార్జీల పెంపు విషయంపై వస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ, గత ప్రభుత్వం లాగా తాము కేవలం మాటలు చెప్పలేమని, వాస్తవికతకు దగ్గరగా వ్యవహరిస్తామని అన్నారు. రైల్వే లైన్ల నిర్మాణాలకు, కొత్త రైళ్ళ ఏర్పాటు వగైరా రైల్వే అభివృద్ధి పనులకు కనీసం అయిదు లక్షల కోట్ల రూపాయలు అవసరమని, ఈ నేపథ్యంలో ప్రజలకు కొంతమేరకు భారమే అయినప్పటికీ, రైల్వే ఛార్జీలు పెంచక తప్పడం లేదని, ఈ విషయాన్ని ప్రజలు సహృదయంతో అర్థం చేసుకుంటారని భావిస్తున్నామని స్పష్టం చేశారు. ఛార్జీలు కొంత పెంచుతున్నప్పటికీ సీజన్ టిక్కెట్లపై 50శాతం సబ్సిడీ వుంటుందని ఆయన పేర్కొన్నారు. తాజాగా, రైలు ఛార్జీల పెంపు చేదుమాత్ర మింగినట్లు అనిపించినా, ఆరోగ్యం కుదుటపడాలంటే ఇది తప్పనిసరి పరిస్థితి అని ఆయన అన్నారు. వాస్తవానికి దేశంలో ప్రస్తుతం వున్న అస్తవ్యస్త ఆర్ధికపరిస్థితుల్లో సమస్యలను అధిగ మించి, అభివృద్ధి పథం వైపు పయనించడానికి కొన్ని నిర్ణయాలు కాస్త కఠినమైనవైనా, తప్పనిసరి పరిస్థతుల్లో చేస్తున్న ఇలాంటి వాటిని సరైన రీతిలో అందరూ అవగాహన చేసుకోవాల్సి వుంది. అస్తవ్యస్త పరిస్థితుల్లో వున్న దేశాన్ని సరైన గాడిలో పెట్టేందుకు, వీలైనన్ని సంస్కరణలను చేపట్టి దేశాన్ని ప్రగతి మార్గం పట్టించేందుకు ప్రధాని నరేంద్రమోడీ ఎంతో చిత్తశుద్ధితో చేస్తున్న కృషిని అర్థం చేసుకోవాల్సి వుంది.

అయినా, కొత్త ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు కూడా దాటకముందే, విమర్శలు గుప్పించేకంటే, దేశాభ్యున్నతికి అందరం కలసి సహకరిస్తే దేశం ఇప్పుడున్న పరిస్థితి నుంచి మరింత మేలైన స్థితికి వస్తుంది. ఆ దిశలో ఆలోచించినప్పుడే దేశ ప్రగతికి మనవంతు కూడా కొంత మేలు చేసినట్లవుతుంది.



కేంద్రమంత్రి వెంకయ్యనాయుడును సత్కరిస్తున్న వైకాపా నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



కేంద్రమంత్రి వెంకయ్యనాయుడును సత్కరిస్తున్న టీటీడీ స్థానిక సలహా మండలి సభ్యులు

# అభిమానానికి అభినందన

కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి యం.వెంకయ్యానాయుడు బీజేపీకి చెందిన నాయకులైనప్పటికీ అన్ని పార్టీల వారితో ఆయన కలుపుగోలుగా ఉంటాడు. దేశ సంచారి. దేశమంతా ఆయన జన్మస్థలమే. అయితే నెల్లూరు తర్వాత ఆయన ఎక్కువుగా ఉండడానికి ఇష్టపడేది బెంగుళూరు, చెన్నైలలోనే! పార్టీలకతీతంగా ఈ నగరాలలో వున్న ప్రముఖులందరూ ఆయనను అభిమానిస్తుంటారు. ఎన్డీఏ ప్రభుత్వంలో రెండోసారి కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంకయ్యానాయుడు ఈ నెల 20వతేదీన సాయంత్రం చెన్నైకు వచ్చారు. 21వ తేదీ ఉదయం పలువురు పార్టీ నాయకులు, ప్రముఖులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం చెన్నైలోని ఇమేజ్ ఆడిటోరియంలో చెన్నైలో వున్న తెలుగు ప్రముఖులంతా కలిసి ఆయనపై అభిమానంతో అభినందన సభ ఏర్పాటు చేసారు. శ్రీసిటీ ఛైర్మెన్ రవి సన్నారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలుగు ప్రముఖులు, అందులో ప్రత్యేకించి నెల్లూరోళ్లు, వివిధ వర్గాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వెంకయ్యానాయుడిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ తెలుగువారు ఎక్కడున్నా కలసికట్టుగా ఉండాలని, తమ రాష్ట్ర పురోభివృద్ధికి సహకరించాలని అన్నారు.

గత యూపిఏ ప్రభుత్వ వైఫల్యాల వల్ల దేశ ఆర్ధిక వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని, దానిని కేంద్రప్రభుత్వం అదుపులో పెట్టే పనిలో ఉందన్నారు. కేంద్రప్రభుత్వం దేశంలోని అన్ని భాషలను గౌరవిస్తుందని, అయితే హిందీని జాతీయ భాషగా గౌరవించడంలో ఎలాంటి తప్పు లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.పి మంత్రి కామినేని శ్రీనివాస్, మాజీఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, సినీనటులు సాయికుమార్, సవేరా హోటల్ చక్రవర్తి, సీబ్రోస్ సుబ్బారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు హీరో మోటోకార్ప్ కంపెనీ

ఆటోమొబైల్ రంగంలో పేరెన్నికగన్న హీరో మోటోకార్ప్ కంపెనీ నెల్లూరుజిల్లాలో తమ పరిశ్రమ స్థాపించబోతుంది. మోటార్ బైక్‌లను తయారు చేసే కంపెనీ తమ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను పరిశీలించింది. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆ కంపెనీని ఆహ్వానించాయి. అయితే ఈ కంపెనీ యాజమాన్యం నెల్లూరుజిల్లా సరిహద్దులో తమ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. నెల్లూరు సరిహద్దు అయితే చెన్నైకు సమీపంలో వుంటుంది. జల రవాణాకు ఎన్నూరు పోర్టు అందుబాటులో ఉంటుంది. ఇక చెన్నై ఎయిర్‌పోర్టు కూడా ఎలాగూ దగ్గరే! కాబట్టే వాళ్లు ఇక్కడే ప్లాంట్ నిర్మాణానికి సుముఖంగా వున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ఆ కంపెనీ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాధికారులతో చర్చలు జరిపారు. ఈ ప్లాంటు వస్తే పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి.






Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.